**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

**ఫోన్ నెం : 9885315759**



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 256 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | గురువారం 5 ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


# వచ్చేది మా ప్రభుత్వమే. వడ్డీతో సహా బదులిస్తాం

- అంబటి రాంబాబు హత్యకు ప్రయత్నించారు
- వైయస్ జగన్ ఫైర్
- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన చంద్రబాబు
- ఒక భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు
- స్వార్థం కోసం దేవుణ్నీ రాజకీయాల్లోకి లాగుతున్నారు
- కేవలం దురుద్దేశంతోనే తిరుమల నెయ్యిపై ఆరోపణ
- ఆ ఫ్లెక్సీలు మేము పెడితే ఊరుకుంటారా చంద్రబాబు?
- రాంబాబు, రమేష్ ఇళ్లల్లో దారుణంగా విధ్వంసం
- ఇప్పుడు తప్పు చేసిన ఎవ్వరినీ వదిలి పెట్టబోము
- గుంటూరులో చురకలంటించిన శ్రీ వైయస్ జగన్

గుంటూరు: రాష్ట్రంలో జంగిల్‌రాజ్ కొనసాగుతోందని, గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబును హత్య చేయడానికి ప్రయత్నించారని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అ్యధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫైర్ అయ్యారు. ప్రజాస్వామాన్ని దారుణంగా ఖూనీ చేస్తున్న సీఎం చంద్రబాబు, రాష్ట్రంలో ఒక భయానక

- మిగతా 2లో





# భారత్ మారలేదు.. అమెరికాకు రష్యా షాక్

రష్యా : రష్యా నుంచి భారత్ ముడి చమురు దిగుమతులను నిలిపివేస్తోందన్న అమెరికా వాదనలను రష్యా ప్రభుత్వం కొట్టిపడేసింది. భారత్ తన చమురు కొనుగోలు విధానంలో ఎలాంటి మార్పులు చేయలేదని.. ఇరుదేశాల మధ్య ఇంధన వాణిజ్యం మునుపటిలాగే కొనసాగుతుందని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. వైట్ హౌస్ ప్రకటనతో మొదలైన వివాదం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీ మధ్య జరిగిన చర్చల తర్వాత రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపివేసి. అమెరికా నుంచి దిగుమతులు పెంచుకోవడానికి భారత్ అంగీకరించిందని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ ఇటీవల ప్రకటించారు. రష్యా పై

- మిగతా 2లో



# మంత్రి లోకేశ్‌తో వివిధ పార్టీల యువ ఎంపీల భేటీ

దిల్లీ పర్యటనలో ఉన్న తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌తో వివిధ పార్టీలకు చెందిన యువ ఎంపీలు బుధవారం ఇక్కడ భేటీ అయ్యారు. తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు నివాసంలో జరిగిన ఈ విషయాన్ని భాజపా యువ నాయకుడు, బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్వీ సూర్య సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పంచుకున్నారు. “మధ్యాహ్న భోజన సమయంలో వివిధ పార్టీలకు చెందిన ఎంపీలం అంతా కలిసి ఆంధ్రప్రదేశ్ చురుకైన నాయకుడు, కార్యదక్షుడు నారా లోకేశ్‌తో కలవడం చాలా స్ఫూర్తినిచ్చింది. మా రాష్ట్రాలకు ఇంకా ఏం చేయగలమన్న అంశంపై మేం ఆలోచనలను పంచుకున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో

- మిగతా 2లో

## స్థానిక సంస్థల్లో బీసీల కోటా ఖరారుకు

# డెడికేటెడ్ కమిషన్



- వారం, పది రోజుల్లో ఏర్పాటు
- ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం
- కులగణన పైనా చర్చ..
- సమగ్ర సమాచారంతో రావాలని అధికారులకు నిర్దేశం

అమరావతి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు 34% రిజర్వేషన్లకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వారం పది రోజుల్లో కమిషన్‌ను ప్రకటించనున్నారు. సచివాలయంలో ముఖ్యమంత్రి బుధవారం బీసీ సంక్షేమశాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కులగణన చేపట్టాల్సిన ఆవశ్యకతపైనా చర్చ జరిగింది. దీనిపై మరింత సమగ్ర సమాచారంతో రావాలని అధికారులను సీఎం ఆదేశించారు. మరో ఎన్నికల హామీ అయిన బీసీల రక్షణ చట్టంపైనా చర్చ జరిగింది. దేశంలో మరే రాష్ట్రంలోనూ ఈ తరహా చట్టం

- మిగతా 2లో



## ప్రజాస్వామ్యాన్ని

# రక్షించండి

**‘సర్’ను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో స్వయంగా వాదించిన మమత**

దిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో కొనసాగుతున్న ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై జోక్యం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని సుప్రీంకోర్టుకు ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ విజ్ఞప్తి చేశారు. తమ రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకున్నారని, అర్హులైన ప్రజలను ఓటర్ల జాబితాల్లో చేర్చడం లేదని ఆరోపించారు.

- మిగతా 2లో

# బూతుల నేతలకు పరామర్శలా? జగన్‌పై టీడీపీ నేతల ఎదురుదాడి

- జగన్ గుంటూరు పర్యటనపై టీడీపీ నేతల ఫైర్
- అంబటి కుటుంబాన్ని పరామర్శించడం ఓ డ్రామా అంటూ విమర్శలు
- బూతులు మాట్లాడిన వారిని సమర్థించడం జగన్‌కు తగదని హితవు
- దమ్ముంటే ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని సవాల్
- తిరుపతి లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగిందనడం పచ్చి నిజం అని ఉద్ఘాటన

- మిగతా 2లో



# నేడు చంద్రబాబు నివాసంలో కూటమి నేతల కీలక భేటీ

- తిరుమల లడ్డూ వివాదంపై చర్చించేందుకు రేపు కూటమి నేతల భేటీ
- ఉండవల్లిలో సమావేశం కానున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- ప్రజల్లోకి వెళ్లే వ్యూహం, ప్రచారంపై ప్రధానంగా చర్చించనున్న నేతలు
- తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారంపైనా సమాలోచనలు



ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమైన తిరుమల లడ్డూ వివాదంపై అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు కూటమి నేతలు కీలక సమావేశం నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ రేపు (ఫిబ్రవరి 5) భేటీ కానున్నారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో

- మిగతా 2లో



# మాకంటే వారి వద్దే శక్తిమంతమైన ఆయుధాలు

- బలూచ్ తిరుగుబాటుదారుల వద్ద అమెరికన్ అడ్వాన్స్‌డ్ ఆయుధాలు ఉన్నాయి
- బలూచ్ తిరుగుబాటుదారుల వద్ద ఉన్న ఆయుధాలు తమ సైన్యంలో కూడా లేవన్న ఆసిఫ్
- ఈ ఆయుధాలు వారికి ఎక్కడి నుంచి వస్తున్నాయన్న పాక్ రక్షణ మంత్రి
- వీరిపై పాక్ సైన్యం పూర్తి స్థాయిలో దాడి చేస్తుందని వెల్లడి

- మిగతా 2లో

# జపాన్‌లో భారీ హిమపాతం.. 35 మంది మృతి

టోక్యో: ఉత్తర జపాన్‌లోని దాదాపు 15 ప్రాంతాలను రెండు వారాలుగా భారీ హిమపాతం ముంచెత్తుతోంది. మంచు ధాటికి దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 35 మంది మరణించగా, 300 మందికి పైగా గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. తమ ఇంటిపై పేరుకుపోయిన మంచును తొలగించే క్రమంలో కిందికి జారిపడటం, హఠాత్తుగా గుండెపోటుకు గురవడం లాంటి కారణాలతో పలువురు ప్రాణాలు కోల్పోయారని, మరికొందరు గాయపడ్డారని పేర్కొన్నారు. సుమారు 2 మీటర్ల మేర మంచు పేరుకుపోవడంతో దేశవ్యాప్తంగా రైళ్లు,



- మిగతా 2లో

# అందుకే పవన్‌ను మేం దిష్టి కల్యాణ్ అంటాం

జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్. పవన్ ఆంధ్రాలో రాజకీయం చేసుకోవాలని.. తెలంగాణలో కాదని అన్నారు. ఆయనను తెలంగాణ ప్రజలు ఆదరించరని అన్నారు. గతంలో తెలంగాణ రాష్ట్రం గురించి, తెలంగాణ వ్యక్తుల గురించి,

- మిగతా 2లో



# వచ్చేది మా ప్రభుత్వమే. వడ్డీతో సహా బదులిస్తాం

వాతావర ణాన్ని సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడారని దురుద్దేశంతో దుష్ప్రచారం చేసిన చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్, పవన్‌కళ్యాణ్ ఆరోపణలు, విమర్శల్లో వాస్తవం లేదని కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రతిష్టాత్మకమైన ఎన్‌డీఆర్ఐ (నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్), ఎన్‌డీడీబీ (నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు) స్పష్టమైన నివేదికలు ఇచ్చాయని ఆయన గుర్తు చేశారు. అదే విషయాన్ని సీబీఐ సిట్ ఛార్జ్‌షీట్‌లో పొందుపర్చిందని చెప్పారు.

దేవుడి పేరుతో రాజకీయం చేశామని, తప్పు ఒప్పుకుంటూ క్షమాపణ కోరాల్సిన చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్, పవన్‌కళ్యాణ్ ఎదురుదాడి చేస్తున్నారని శ్రీ వైయస్ జగన్ తెలిపారు. పచ్చి అబద్ధాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని ప్రస్తావించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలేవీ అమలు చేయకుండా చేసిన మోసాన్ని చెబుతూ, తామూ అలాగే ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే ఊర్కుంటారా అని ప్రశ్నించారు. తప్పులను ప్రశ్నిస్తే ఇలా దాడులు చేయడం అత్యంత హేయమని అభివర్ణించారు. తాము అధికారంలోకి వచ్చాక, ఇప్పుడు తప్పు చేసిన, చేస్తున్న వారెవ్వరినీ వదిలిపెట్టబోమని, విచారణ జరిపిస్తామని, కోర్టు బోను ఎక్కిస్తామని గుంటూరులో అంబటి రాంబాబు ఇంటి వద్ద మీడియాతో మాట్లాడిన శ్రీ వైయస్ జగన్ స్పష్టం చేశారు.

**రాష్ట్రంలో జంగిల్‌రాజ్:**

రాష్ట్రంలో ఈరోజు జంగిల్‌రాజ్ కొనసాగుతోంది. అది ఏ స్థాయిలో ఉంది అంటే ప్రజాస్వామ్యం ఎప్పుడో ఖూనీ అయిపోయింది. ఒక భయానక వాతావరణంతో రాష్ట్రాన్ని పరిపాలించే కార్యక్రమం ఈరోజు జరుగుతోంది. ఈరోజు అంబటి రాంబాబుపై జరిగిన దాడి అయితేనేమి, జోగి రమేష్ ఇంటి మీద దాడి విషయమైతేనేమి, విడదల రజిని మీద అటాక్ చేసిన విషయమైతేనేమి, బొల్లా బ్రహ్మనాయుడు మీద అటాక్ చేసిన విషయమైతేనేమి.. ఇవన్నీ ఈ మధ్య కాలంలో జరిగిన కొన్ని ఘటనలు మాత్రమే. అవి చూస్తే కూడా జంగిల్‌రాజ్ అన్నది ఏ స్థాయిలో ఉంది అన్నది ఇట్టే అర్థమయ్యే విషయం.

నేను అడుగుతున్నాను. అంబటి రాంబాబు, విడదల రజిని, జోగి రమేష్, భూమన కరుణాకర్‌రెడ్డి, కాకాణి గోవర్థన్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు చేసిన తప్పేమిటి?.

**శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ప్రతిష్టకు భంగం కలిగించేలా..!:**

చంద్రబాబునాయుడు అనే వ్యక్తి దాదాపు ఏడాదిన్నర నుంచి కావాలని ఉద్దేశపూర్వకంగా అబద్ధాలతో కూడిన ప్రకటనలు చేస్తూ, ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమం చేశారు. పవిత్రమైన తిరుమల శ్రీవారి ప్రసాదమైన లడ్డూ తయారీలో వాడిన నెయ్యిలో భక్తుల మనోభావాలు దెబ్బ తీసే విధంగా కావాలని, కుట్రపూరితంగా ఆ నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందని, గొడ్డు మాంసం కొవ్వు ఉందని, పంది కొవ్వు ఉందని, చేపనూనె కలిసింది అంటూ రకరకాలుగా చంద్రబాబునాయుడు, ఆయన కొడుకు, చంద్రబాబుతో కలిసి ఉన్న పవన్‌కల్యాణ్.. ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేశారు. శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ప్రతిష్టను దెబ్బ తీసే విధంగా, దేవుడంటే కనీసం భయం, భక్తీ లేకుండా రాజకీయాల కోసం దేవుణ్ని ఉపయోగించడం మొదలు పెట్టారు.

**అవి పూర్తిగా అవాస్తవమని తేలింది:**

అయితే ఆ ఆరోపణలన్నీ కూడా అవాస్తవం అని ఏకంగా ఎన్‌డీడీబీ (నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు), ఎన్డీఆర్ఐ (నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) రిపోర్టు ఇచ్చాయి. ఆ రెండూ కూడా కేంద్రానికి సంబంధించిన ల్యాబులు. వీళ్ల హయాంలో, వీళ్లు ఇచ్చిన టెస్ట్ శాంపిళ్లు. అవి టెస్ట్ శాంపిళ్లు కూడా. వాటిని అనాలసిస్ చేసి వాళ్లు సీబీఐ ఆధ్వర్యంలో అనలైజ్ చేసి ఆ నెయ్యిలో జంతువుల కొవ్వు కానీ, గొడ్డు మాంసం కొవ్వు కానీ, పందికొవ్వు కానీ, చేప నూనె కానీ, ఇంకొకటి కానీ ఏవీ లేవని నిర్ధారణ చేసి సర్టిఫికెట్లు ఇచ్చాయి. అదే విషయాన్ని సీబీఐ సిట్ తన ఛార్జ్‌షీట్‌లో పొందుపర్చి, అవే ఎన్‌డీడీబీ, ఎన్‌డీఆర్ఐ సర్టిఫికెట్లు కూడా జత చేసి, క్లోజర్ ఇచ్చింది.

# బూతుల నేతలకు పరామర్శలా? జగన్‌పై టీడీపీ నేతల ఎదురుదాడి

వైసీపీ అధినేత జగన్ తీరుపై అధికార తెలుగుదేశం పార్టీ నేతలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గుంటూరులో అంబటి రాంబాబును పరామర్శించేందుకు జగన్ చేసిన పర్యటనను ఒక డ్రామాగా అభివర్ణించారు. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, సీడాప్ ఛైర్మన్ దీపక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు... జగన్‌పై తీవ్ర విమర్శలు చేశారు.

**పరామర్శ పేరుతో డ్రామా: అచ్చెన్నాయుడు**

మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. "అసభ్యంగా బూతులు మాట్లాడిన నేతలను దండించాల్సింది పోయి, పరామర్శ పేరుతో జగన్ డ్రామాలు చేస్తున్నారు. తాడేపల్లి నుంచి గుంటూరుకు 34 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 30 నిమిషాల్లో చేరుకోవచ్చు. కానీ, మునిగిపోతున్న వైసీపీని కాపాడుకునే విఫల ప్రయత్నంలో భాగంగా జగన్ ఈ ప్రయాణాన్ని 9 గంటల పాటు సాగదీశారు. తిరిగి మాత్రం అరగంటలోనే వచ్చేశారు. ఇది ప్రజాబలం లేక టీవీ సీరియల్ మాదిరి సాగదీసిన యాత్ర" అని ఎద్దేవా చేశారు. తమ పార్టీ నాయకులు అంబటి ఇంటికి వెళ్లి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తే, దానిని దాడిగా చిత్రీకరిస్తున్నారని అన్నారు. ఈ ఘటనను ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఖండించారని, హింసా రాజకీయాలకు తమ ప్రభుత్వంలో తావులేదని స్పష్టం చేశారు. "గత ఐదేళ్ల జగన్ జంగిల్ రాజ్ పాలనను చూసే ప్రజలు 151 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితం చేశారు. ప్రజా సమస్యలపై మాట్లాడాలంటే రోడ్లపై కాదు, దమ్ముంటే అసెంబ్లీకి రండి" అని జగన్‌కు సవాల్ విసిరారు.

**అరాచకానికి బీజం వేసింది జగనే: వర్ల రామయ్య**

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ.. "గత ఐదేళ్లు రాష్ట్రాన్ని అరాచకమయం చేసి, ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది" అని తీవ్రంగా ధ్వజమెత్తారు. అసలు రాష్ట్రంలో జంగిల్ రాజ్‌కు బీజం వేసిందే జగన్ అని ఆరోపించారు. అంబటి రాంబాబు లాంటి వ్యక్తిని సౌమ్యుడని కితాబివ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో చంద్రబాబును ఇంటి గేటుకు తాళ్లు కట్టి అడ్డుకోవడం, మాచర్లలో టీడీపీ నేతలపై హత్యాయత్నం, అచ్చెన్నాయుడిని అక్రమంగా అరెస్టు చేయడం వంటివి జంగిల్ రాజ్ కాదా అని ప్రశ్నించారు. కొల్లు రవీంద్ర, ధూళిపాళ్ల నరేంద్ర, దేవినేని ఉమా వంటి నేతలపై అక్రమ కేసులు బనాయించి వేధించారని గుర్తుచేశారు. చంద్రబాబు ఇంటిపై దాడికి తెగబడిన జోగి రమేశ్ ను మంచివాడని చెప్పడం సిగ్గుచేటన్నారు.

**11 మందితో అసెంబ్లీకి రండి: దీపక్ రెడ్డి**

సీడాప్ ఛైర్మన్ దీపక్ రెడ్డి మాట్లాడుతూ.. "వంద ఎలుకలను తిన్న పిల్లి కాశీకి వెళ్లినట్లు ఉంది జగన్ తీరు" అని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో గన్నవరం టీడీపీ ఆఫీసును తగలబెట్టడం, పట్టాభి ఇంటిపై దాడి చేసి మహిళలను భయభ్రాంతులకు గురిచేయడం, ఎంపీ రఘురామకృష్ణరాజుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం వంటివి జంగిల్ రాజ్ కాదా? అని నిలదీశారు. "11 మంది సభ్యులు మీకు ఒక క్రికెట్ టీమ్ లాంటి వారు. అందుకే మీకు 'నెంబర్ 11 సైకో టీమ్' అని పేరు పెట్టాం. ఈ నెల 11న, 11 గంటలకు అసెంబ్లీకి వచ్చి కనీసం 11 నిమిషాల పాటు 11 ప్రశ్నలు అడిగే ధైర్యం ఉందా?" అని జగన్‌కు సవాల్ విసిరారు.

**లడ్డూ నెయ్యిలో కల్తీ నిజం: అశోక్ బాబు**

మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు మాట్లాడుతూ.. తిరుపతి లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగిందనేది పచ్చి నిజమని స్పష్టం చేశారు. 2024 జులై 16న ఎన్డీడీబీ ఇచ్చిన రిపోర్టులో బీఫ్ ఫ్యాట్ (ఆవు/ఎద్దు కొవ్వు), లార్డ్ (పంది కొవ్వు) ఉన్నట్లు స్పష్టంగా ఉందని తెలిపారు. వైసీపీ నేతలు టెక్నికల్ అంశాల పేరుతో దీన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ వ్యవహారంపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని వైసీపీకి సవాల్ విసిరారు. జగన్ రిపోర్టులు చదవకుండా మాట్లాడటం ఆయన అపరిపక్వతకు నిదర్శనమని విమర్శించారు.

# భారత్ మారలేదు.. అమెరికాకు రష్యా షాక్

-మొదటిపేజీ తరువాయి

భారత్ ఆధారపడటాన్ని తగ్గించడమే ఈ ఒప్పందం ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. అమెరికా వాదనలను ఖండించిన రష్యా. అమెరికా ప్రకటన పై రష్యా విదేశాంగ శాఖ ఘాటుగా స్పందించింది. భారత్ తన నిర్ణయాన్ని మార్చుకుందని భావించడానికి మాకు ఎలాంటి కారణం కనిపించడం లేదు. రష్యా-భారత్ ఇంధన వాణిజ్యం ఇరు దేశాలకు ప్రయోజనకరంగా ఉండటమే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల స్థిరత్వానికి తోడ్పడుతోంది అని రష్యా పేర్కొంది. రష్యా అధ్యక్షుడి అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ కూడా మాట్లాడుతూ భారత్ నుంచి తమకు ఎలాంటి అధికారిక సమాచారం రాలేదని స్పష్టం చేశారు. భారత రిఫైనరీల స్పందన రష్యా నుంచి చమురు కొనుగోళు ఆపాలని ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని భారత చమురు రిఫైనరీ వర్గాలు వెల్లడించాయి. గత డిసెంబర్, జనవరి నెలల్లో రష్యా నుంచి దిగుమతులు స్వల్పంగా తగ్గినప్పటికీ, అది కేవలం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించే ప్రక్రియలో భాగమే తప్ప, ఒప్పందాలను రద్దు చేసుకోవడం కాదని స్పష్టం చేశాయి. నిశ్శబ్దంగా ఉన్న భారత్, అమెరికా చేస్తున్న ప్రకటనల పై భారత ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. రష్యాతో ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కాపాడుకుంటూనే అమెరికా వాదనల పై భారత్ ఎలాంటి వైఖరి తీసుకుంటుందనేది ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతానికి మాత్రం రష్యా చమురు దిగుమతుల్లో భారీ మార్పులేవీ లేవని విశ్లేషకులు భావిస్తున్నారు.

# నేడు చంద్రబాబు నివాసంలో కూటమి నేతల కీలక భేటీ

-మొదటిపేజీ తరువాయి

ఉదయం 11 గంటలకు ఈ సమావేశం జరగనుంది.
లడ్డూ వివాదంపై ప్రజల్లోకి ఎలా వెళ్లాలి, ఏయే అంశాలను ప్రస్తావించాలి, ప్రచార కార్యక్రమాలను ఎలా చేపట్టాలనే దానిపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించనున్నారు. ఇప్పటికే ఈ విషయంపై చంద్రబాబు, పవన్ మధ్య ప్రాథమికంగా చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ అంశాన్ని ప్రజల ముందుకు బలంగా తీసుకెళ్లి, తమ వాదనను వినిపించాలని కూటమి భావిస్తోంది. ఇందుకు సంబంధించిన పూర్తిస్థాయి రోడ్‌మ్యాప్‌ను ఈ సమావేశంలో ఖరారు చేసే అవకాశం ఉంది.

# మంగళగిరిలో పవన్ కల్యాణ్‌ను కలిసిన రాజేంద్రప్రసాద్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ప్రముఖ నటుడు రాజేంద్ర ప్రసాద్ కలిశారు. మంగళగిరి క్యాంప్ కార్యాలయంలో నిన్న మధ్యాహ్నం మర్యాదపూర్వకంగా పవన్‌తో భేటీ అయ్యారు. రాజేంద్రప్రసాద్‌కు కేంద్ర ప్రభుత్వం ఇటీవల పద్మశ్రీ పురస్కారం ప్రకటించిన నేపథ్యంలో పవన్‌ను కలిశారు. పలు విషయాలు చర్చించుకున్నారు.
ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్‌కి పవన్ అభినందనలు తెలిపారు. అనంతరం పవన్ కల్యాణ్‌ను దుశ్శాలువాతో రాజేంద్ర ప్రసాద్ సన్మానించారు. రాజేంద్రప్రసాద్‌ను పవన్ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన ఫోటోలను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన సోషల్ మీడియా ఖాతా ఎక్స్‌లో పంచుకున్నారు. దీనికి సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# మాకంటే వారి వద్దే శక్తిమంతమైన ఆయుధాలు

పాకిస్థాన్ ప్రభుత్వానికి కొన్నేళ్లుగా బలోచ్ రెబెల్స్ పంటికింద రాయిలా మారారు. వారివద్ద అమెరికా ఆయుధాలు ఉన్నాయని పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ (ఖ్రుఆఴుఅ ఐవటవఅఎవ వీఆఅఆర్వతీ ఖష్ట్రుఝుయిఝ ాాంఅట) వ్యాఖ్యలు చేశారు. వాటిలో నైట్ విజన్ డివైజ్‌లు, రైఫిళ్ల వంటి అధునాతన ఆయుధాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాంటివి తమ సైన్యం వద్ద కూడా లేవన్నారు. ఈ మేరకు ఆయన నేషనల్ అసెంబ్లీలో మాట్లాడారు.
పాక్ ప్రావిన్స్ బలోచిస్థాన్ వైశాల్యం, రెబెల్స్ వద్ద ఉన్న అధునాతన ఆయుధాల కారణంగా వారితో పోరాడేందుకు పాక్ సైన్యం ఇబ్బందిపడుతోందని మంత్రి అంగీకరించారు. "వారివద్ద 20 లక్షల రూపాయల (పాక్ కరెన్సీలో) విలువైన రైఫిల్ ఉంది. అది మనవద్ద లేదు. 4000 డాలర్లు నుంచి 5000 డాలర్ల విలువైన థర్మల్ వెపన్ సైట్స్ ఉన్నాయి. ఇలాంటి ఆయుధాలన్నీ వారికి ఎక్కడినుంచి వస్తున్నాయి..? వీటిల్లో కొన్ని అమెరికా ఆయుధాలు కూడా ఉన్నాయి. ఈ ఉగ్రవాదుల నాయకులు అఫ్గానిస్థాన్‌లో ఉన్నారు. అక్కడి నుంచే వారికి మద్దతు లభిస్తోంది. ప్రభుత్వవ్యతిరేక కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నవారితో చర్చలు జరపలేం. దాడులు ఆపకపోతే.. పరిణామాలు తీవ్రంగా ఉంటాయి" అని బలోచ్ రెబెల్స్‌ను మంత్రి హెచ్చరించారు.ఇరాన్, అఫ్గానిస్థాన్ సరిహద్దుకు సమీపంలోని బలోచిస్థాన్ కేంద్రంగా వేర్పాటువాద సంస్థ బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) కార్యకలాపాలు నిర్వహిస్తోంది. దీనిని అమెరికా ఉగ్రసంస్థగా గుర్తించింది. ఈ సంస్థ సైన్యానికి చెందిన మౌలికసదుపాయాలు, పోలీసులు, స్థానిక అధికారులపై కొన్నేళ్లుగా దాడులు చేస్తోంది. ఇటీవల బలోచిస్థాన్ ప్రావిన్సులోని వేర్వేరు ప్రాంతాల్లో రెబెల్స్ దాడులు చేశారు. దాంతో పాకిస్థాన్ కౌంటర్ ఆపరేషన్ నిర్వహించింది. ఈ ఘటనల్లో 200 మంది వరకు రెబెల్స్‌తో పాటు పౌరులు, భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు.

# మంత్రి లోకేశ్‌తో వివిధ పార్టీల యువ ఎంపీల భేటీ

-మొదటిపేజీ తరువాయి

అమలు చేస్తున్న పరిపాలనా విధానాల గురించి లోకేశ్ నుంచి తెలుసుకున్నాం. పరస్పరం తరుచుగా కలుసుకొని ఒకరి నుంచి మరొకరు మరిన్ని విషయాలు తెలుసుకోవాలని సంకల్పించాం. భారత దేశాన్ని మరింత ముందుకు నడిపించడానికి యువ రాజకీయ నాయకత్వం చేయాల్సింది చాలా ఉంది. ఒక పటిష్ఠమైన, సంపన్నమైన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిస్తున్నందుకు లోకేశ్ అన్నకు శుభాకాంక్షలు. సంకల్పించిన పనులను వేగంగా పూర్తిచేయాలనే ఆయన తపనను నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను' అని తేజస్వీ సూర్య పేర్కొన్నారు.
కూటమి ఎంపీలతో..

ఉదయం లోకేశ్ కేంద్రమంత్రి పెమ్మసాని నివాసంలో రాష్ట్రానికి చెందిన కూటమి ఎంపీలతో సమావేశమయ్యారు. కేంద్రం నుంచి ప్రస్తుతం రాష్ట్రానికి సంపూర్ణ సహకారం అందుతున్నందున బడ్జెట్‌లో చెప్పిన అన్ని అంశాలనూ సాధించడానికి ఎంపీలు వ్యక్తిగతంగా చొరవ తీసుకొని పనిచేయాలని కోరారు. ఇందులో తెదేపా ఎంపీలతోపాటు జనసేన ఎంపీ బాలశౌరి, భాజపా ఎంపీ పాకా సత్యనారాయణ, మాజీ ఎంపీ గల్లా జయదేవ్ కూడా పాల్గొన్నారు.

## జపాన్‌లో భారీ హిమపాతం.. 35 మంది మృతి

-మొదటిపేజీ తరువాయి

రవాణా వ్యవస్థతో పాటు ఇతర ప్రజాసేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. 1,700కు పైగా ఇళ్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయినట్లు చెప్పారు. ఇంత అధికంగా మంచు కురవడం గత 40 ఏళ్లలో ఇదే మొదటిసారని.. రానున్న రోజుల్లో హిమపాతం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని తెలిపారు.

## ప్రజాస్వామ్యాన్ని రక్షించండి

-మొదటిపేజీ తరువాయి

సర్ కసరత్తును వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కోర్టులో బుధవారం ఆమె స్వయంగా వాదనలు వినిపించారు. ఈ ధర్మాసనంలో జస్టిస్ జోయ్‌మల్యాబాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలి కూడా సభ్యులుగా ఉన్నారు. ఎన్నికల సంఘానికి ఇప్పటికే ఆరు లేఖలు రాశానని, తమకు ఎక్కడా న్యాయం జరగలేదని త్రిసభ్య ధర్మాసనానికి మమతా బెనర్జీ తెలిపారు. సుప్రీంకోర్టు న్యాయం చేయాలని అభ్యర్థించారు. సర్ కసరత్తును భాజపా పాలిత అస్సాంలో ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. వాదనల అనంతరం ఎన్నికల సంఘంతో పాటు పశ్చిమ బెంగాల్ ముఖ్య ఎన్నికల అధికారికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ఈ నెల 9వ తేదీకల్లా సమాధానం ఇవ్వాలని ఆదేశిస్తూ అదే రోజుకు కేసు విచారణను వాయిదా వేసింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం తరఫున సీనియర్ న్యాయవాది శ్యామ్‌దివాన్ కూడా వాదనలు వినిపించారు.

## అందుకే పవన్‌ను మేం దిష్టి కల్యాణ్ అంటాం

-మొదటిపేజీ తరువాయి

భాష, సంస్కృతి గురించి దారుణంగా మాట్లాడారని మండిపడ్డారు. అందుకే పవన్ ను దిష్టి కల్యాణ్ అని అంటామని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.
తెలంగాణ ప్రజలు అభివృద్ధి, సంక్షేమం కోరుకుంటున్నారుని.. కాంగ్రెస్ ప్రభుత్వం వారికి సంక్షేమం, అభివృద్ధి ఇస్తుందని అన్నారు. అందుకే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతానికిపైగా మున్సిపాలిటీలు కాంగ్రెస్ గెలుచుకునే అవకాశం ఉందన్నారు. ఆ భయంతో పవన్ కల్యాణ్ లాంటి సినీ తారలను బీజేపీ నాయకులు అడుక్కునే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. తెలంగాణలో పవన్ కల్యాణ్ ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని.. ఆంధ్రాలో రాజకీయాలు చేసుకుంటే మంచిదని పీసీసీ చీఫ్ సూచించారు.

## స్థానిక సంస్థల్లో బీసీల కోటా ఖరారుకు డెడికేటెడ్ కమిషన్

-మొదటిపేజీ తరువాయి

అమలులో లేనందున ఈ ప్రతిపాదనను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుందని ఈ సందర్భంగా అధికారులు నివేదించారు. తానే కేంద్రంతో మాట్లాడతానని, న్యాయపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని పక్కాగా బిల్లును రూపొందించాలని చంద్రబాబు నిర్దేశించారు. తుది రూపు తర్వాత మంత్రివర్గ ఉపసంఘం ముందు కూడా దీన్ని పెట్టి చర్చించాలని సూచించారు. వెనుకబడిన వర్గాలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, వారికి ప్రయోజనం కలిగేలా పథకాలను రూపొందించాలని దిశానిర్దేశం చేశారు.

**మైక్రో ఆంత్రప్రెన్యూర్లుగా బీసీలు..**

వెనుకబడిన తరగతులకు చెందిన వారికి మైక్రో ఆంత్రప్రెన్యూర్లుగా, ఎంఎస్‌ఎంఈలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఆదరణ-3 పథకం కింద కులవృత్తులవారీగా ఆధునిక పరికరాలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. రూ.60 కోట్ల సాస్కీ నిధులతో రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతిగృహాల నిర్మాణంతోపాటు సురక్షిత నీటి కోసం ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. 814 వసతి గృహాల్లో మార్చి నాటికి ఆర్వో ప్లాంట్ల నిర్మాణం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఆహార నాణ్యతపైనా ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల ఆరోగ్యం, విద్య సహా అన్ని అంశాల్లోనూ బెస్ట్ ప్రాక్టీసెస్ అనుసరించాలని సూచించారు. బీసీ విద్యార్థులకు విద్యాపరమైన అంశాల పర్యవేక్షణకు అపార్ ఐడీలను నమోదు చేసి అనుసంధానించాలన్నారు.

**బీసీ భవనాలను పూర్తి చేయాలి**

రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న బీసీ భవనాలను పూర్తి చేయాలని చంద్రబాబు ఆదేశించారు. 6 రెసిడెన్షియల్ పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా మార్చాలన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ బీసీ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నామన్నారు. బీసీ స్టడీ సర్కిళ్లను తదుపరి స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు.

**డ్వాక్రా ఉత్పత్తులకు 'స్వయం' బ్రాండింగ్: సీఎం**

డ్వాక్రా ఉత్పత్తులకు బ్రాండింగ్ కోసం 'స్వయం' అనే పేరును ముఖ్యమంత్రి చంద్రబాబు ఖరారు చేశారు. డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించే అంశంపై బుధవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు సమీక్షించారు. బ్రాండింగ్‌కు అధికారులు ప్రతిపాదించిన వివిధ పేర్లు, లోగోలను ఆయన పరిశీలించారు. లోగో ఖరారుకు డ్వాక్రా మహిళల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. మెజారిటీ అభిప్రాయం మేరకు ఖరారు చేయాలని చెప్పారు. 'డ్వాక్రా మహిళలు అద్భుతమైన ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. వాటికి మంచి మార్కెటింగ్ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. స్థానికంగా ఉండే మార్కెట్లే కాకుండా.. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లను కూడా ఆకర్షించేలా బ్రాండింగ్ ఉండాలి' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.


# ట్రంప్ టారిఫ్ గూగ్లీ ని... భారత్ తనదైన స్టైల్లో సిక్సర్ కొట్టింది




**ఇంటర్నెట్ డెస్క్:** భారత్, అమెరికా మధ్య కుదిరిన చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. గత 10 నెలలుగా భారత్ పై ఒత్తిడి పెంచుతూ భారీ సుంకాలు విధిస్తామని బెదిరించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక్కసారిగా వెనక్కి తగ్గి ఒప్పందానికి మొగ్గు చూపడం వెనుక భారీ దౌత్య వ్యూహం దాగి ఉంది. ట్రంప్ వ్యూహం సీజ్ ఫైర్ క్రెడిట్ కోసం ఆరాటం ఉగ్రవాద స్థావరాల పై ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ పట్ల డొనాల్డ్ ట్రంప్ తన వైఖరిని పూర్తిగా మార్చుకున్నారు. భారత్–పాకిస్థాన్ మధ్య సీజ్ ఫైర్ చేయించడం ద్వారా శాంతి దూతగా పేరు తెచ్చుకుని, నోబెల్ బహుమతిని సాధించాలనేది ఆయన వ్యూహం. అయితే భారత్ నుంచి ఆయనకు ఆశించిన స్పందన లభించకపోవడంతో ఆగ్రహించిన ట్రంప్ 50 శాతం టారిఫ్ విధిస్తామని బెదిరించారు. కానీ అటు భారత ప్రభుత్వం గానీ, ఇటు అమెరికా అధికార యంత్రాంగం తమ పని తాము చేసుకుంటూ వెళ్లాయి. తెరవెనుక నడిచిన అసలు కథ డొనాల్డ్ ట్రంప్ పరుష పదజాలంతో విమర్శలు చేస్తున్నప్పటికీ, రెండు దేశాల మధ్య దౌత్యపర మైన చర్చలు ఎప్పుడూ ఆగలేదు. ఈ కీలక వాణిజ్య ఒప్పందం వెనుక అనేక కీలక అంశాలు ఉన్నాయి. భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ, డిప్యూటీ ఎన్ఎస్ఏ పవన్ కపూర్, అమెరికాలో భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా నిరంతరం వాషింగ్టన్‌లో పావులు కదిపారు. గత కొన్ని నెలలుగా అమెరికాకు చెందిన పలువురు సెనేటర్లు, ప్రతినిధులు భారత్ లో పర్యటించారు. మైఖేల్ రోజర్స్ నేతృత్వం లోని బృందం భారత్ ను ప్రధాన రక్షణ భాగస్వామి గా అభివర్ణించింది. భారత్ లో నూతన అమెరికా రాయబారిగా బాధ్యతలు చేపట్టిన సెర్గియో గోర్ వైట్ హౌస్ తో తనకున్న నేరుగా సంబంధాలను ఉపయోగించి ఈ ఒప్పందాన్ని కొలిక్కి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. క్లీన్ బోల్డ్ అయిన ట్రంప్, భారత్ పంతమే నెగ్గింది. చివరికి తన సొంత మంత్రులు, అధికారులు చెప్పిన లెక్కల ముందు డొనాల్డ్ ట్రంప్ పాత మాటలు చెల్లకుండా పోయాయి. 25 శాతం ఉన్న సుంకాన్ని ఏకంగా 18 శాతానికి తగ్గిస్తూ డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ప్రధాని మోదీ కి ఫోన్ చేసి డీల్ అనౌన్స్ చేశారు. అంటే, గత 10 నెలలుగా ఆయన చేసిన విమర్శలన్నీ తుస్సుమన్నాయన్నమాట. మన దేశం రష్యా నుంచి చమురు కొంటున్నా, అమెరికా చెప్పినట్టు కొన్ని మార్పులు చేసుకుంటూనే మన ప్రయోజనాలు దెబ్బతినకుండా ఈ డీల్ సాధించు కోవడం ఒక భారీ విజయం. దీనితో మనకి వచ్చే లాభాలేంటి?: ఈ ఒప్పందం వల్ల మన దేశం లోని టెక్స్టైల్స్ (బట్టలు), ఫార్మా (మందులు), ఐటీ రంగానికి మేలు జరుగుతుంది. అమెరికా మార్కెట్ మనకు ఫుల్ ఓపెన్ అవుతుంది. ఎంత ఒత్తిడి ఉన్నప్పటికీ, భారత్ తన వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని కోల్పోకుండానే అమెరికాతో ఈ లాభదాయక మైన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇది కేవలం వాణిజ్య పరంగానే కాకుండా, అంతర్జాతీయ రాజకీయం దృష్ట్యా కూడా భారత్‌కు దక్కిన అతిపెద్ద దౌత్య విజయంగా చెప్పవచ్చు. మొత్తానికి ట్రంప్ విసిరిన గూగ్లీని, భారత్ తనదైన స్టైల్లో సిక్సర్ కొట్టిందనే చెప్పాలి.

# అరాచకం, విధ్వంసంతో భివృద్ధిని అడ్డు కోవాలన్నదే జగన్ వ్యూహం ప్రత్తిపాటి

- దానిలో భాగంగానే జగన్ తన పార్టీ శ్రేణుల్ని రెచ్చగొట్టే మాటలు, చర్యలు.
- జగన్ ఎన్ని ఆటంకాలు సృష్టించినా చంద్రబాబు తాను చేపట్టిన అభివృద్ధి యజ్ఞాన్ని ఆపరు.




**చిలకలూరిపేట, పెన్ సత్తా, ఫిబ్రవరి 04:**అరాచకం, విధ్వసంతో రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మార్చి, అంతిమంగా అభివృద్ధికి దూరం చేయాలన్న వ్యూహంలో భాగంగానే జగన్ తన పార్టీ శ్రేణుల్ని రెచ్చగొట్టే చర్యలు, ప్రసంగాల దిశగా ప్రోత్సహిస్తున్నాడని మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక ఆర్టీసీ డిపో ప్రాంగణంలో రూ.50 లక్షలతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆర్టీసీ సిబ్బంది, ప్రజల్ని ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టుదలతో తలపెట్టిన రాష్ట్ర అభివృద్ధి యజ్ఞాన్ని అడ్డుకొని, రాష్ట్రంలో విధ్వంసం, అరాచకం సృష్టించాలన్నదే జగన్ వ్యూహమని అన్నారు. రాష్టానికి పెట్టు బడులు రాకుండా అడ్డుకోవాలన్న కుట్రలో భాగంగానే మాజీ ముఖ్యమంత్రి తన పార్టీ శ్రేణుల్ని విద్వేషపూరిత ప్రసంగాలు, మాటల దిశగా రెచ్చగొడుతున్నారని మాజీమంత్రి వివరించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న నాయకుడు, 4 వసారి ముఖ్యమంత్రి ఉన్న చంద్రబాబును ఉద్దేశించి వాడకూడని భాష వాడేలా తన పార్టీ నాయకుల్ని రెచ్చగొట్టి, వారిద్వారా అశాంతి, అలజడులు రేపితే పెట్టు బడిదారులు రాష్ట్రం వైపు చూడరన్నదే జగన్ కుట్ర అని ప్రత్తిపాటి తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెంది, ప్రజలు సుఖసంతోషాలతో ఉంటే కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు కు మంచి పేరు వస్తుందని, దాంతో ప్రజలు తనను నమ్మరని, తన దుర్మార్గ రాజకీయాలు సాగవన్న దురాలోచన, దురుద్దేశం తోనే జగన్ రాష్ట్ర విధ్వంసమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ప్రోత్సాహం, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు తన విశ్వసనీయత, విజన్ తో తాను అనుకున్న విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి చూపిస్తాడని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. జగన్ ఎన్ని ఆటంకాలు, అడ్డంకులు సృష్టించినా చంద్రబాబు లక్ష్యాన్ని, యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలన్న మంత్రి లోకేష్ సంకల్పాన్ని నీరుగార్చలేడని ప్రత్తిపాటి తేల్చిచెప్పారు. ఆర్టీసీ డిపో ప్రాంగణంలో చేపట్టిన అభివృద్ధి పనులు ఏప్రియల్ నాటికి పూర్తి కావాలన్నారు.

పట్టణంలోని ప్రధాన బస్టాండ్ లోని సమస్యల్ని ఆర్టీసీ పూర్వ ఎండీ ద్వారకా తిరుమలరావు దృష్టికి తీసుకెళ్లిన వెంటనే రూ. 50 లక్షల నిధులు మంజూరు చేయించారని ప్రత్తిపాటి చెప్పారు. కోరిన వెంటనే నిదులు మంజూరు చేసిన ద్వారకా తిరుమలరావు మంచితనాన్ని ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది గుర్తించాలన్నారు. వర్షం వస్తే నీరు నిలిచి ఆర్టీసీ డిపో చెరువును తలపిస్తోందని, లోతట్టు ప్రాంతమైనందున వర్షపు, బురదనీటితో ప్రయాణికులు, ఆర్టీసి సిబ్బంది తీవ్ర అవస్థలు పడుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించడానికే నేడు సిమెంట్ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశామని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ప్రస్తుతం రూ.50లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులు కాకుండా, ఇంకా అదనంగా చేయాల్సినవి ఉన్నాయని, వాటిని కూడా త్వరలోనే కార్యరూపం దాల్చేలా చూస్తామని ప్రత్తిపాటి తెలిపారు. ఇప్పుడు ప్రారంభించిన పనులు ఏప్రియల్ నాటికి పూర్తి చేయాలని అధికారుల్ని ఆదేశించినట్టు ఆయన చెప్పారు. మంచి ప్రభుత్వముంటేనే ఆర్టీసీ సంస్థకు, ఉద్యోగులకు మంచి భవిష్యత్ ఉంటుందని, స్థానిక ఆర్టీసీ డిపో ఆదాయం పెంపుపై అధికారులు, ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఖాళీగా ఉన్న స్థలాలపై ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రూపొందించాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. ఆర్టీసీ యూనియన్లు ఎన్ని ఉన్నా, సంస్థ బలోపతం, మనుగడే అందరి ప్రధాన లక్ష్యం కావాలన్నారు. రాజకీయాలతో పనిలేకుండా సంస్థ పరిరక్షణ, ప్రయాణికుల భద్రత సంతోషమే లక్ష్యంగా అందరూ స్నేహపూర్వకంగా మెలగాలని ప్రత్తిపాటి సూచించారు. కార్యక్రమంలో జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, ఆర్టీసీ ఈడి నాగేంద్ర ప్రసాద్, ఆర్ఎం అజిత్ కుమారి, ఆర్టీసీ డీఎం యద్దనపూడి వేణు, బీజేపీ నాయకులు పోట్రూ పూర్ణ చంద్రరావు, ఆర్టీసీ నాయకులు కంచర్ల శ్రీనివాసరావు, వరప్రసాద్, పావులూరి వెంకటేశ్వరరావు , కూటమి నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జీవీఎంసీ ప్రత్యేక బడ్జెట్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే, విష్ణుకుమార్ రాజు






**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 04:** నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి నిర్వహించిన జీవీఎంసీ సర్వసభ్య (ప్రత్యేక) బడ్జెట్ సమావేశం (2026--27)లో ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ పి. విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగర అభివృద్ధి సమతుల్యంగా సాగాలంటే అన్ని నియోజకవర్గాలకు సమానంగా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. విశాఖపట్నం ఒక గొప్ప నగరమని, దీనిని మరింత అందంగా తీర్చిదిద్దుతూ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కమిషనర్, మేయర్, కౌన్సిల్ సభ్యులు అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు.

అలాగే నగర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కార్పొరేటర్లకు గౌరవ వేతనం పెంచాలని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ ప్రతిపాదనకు సమావేశంలో హాజరైన కార్పొరేటర్లు హర్షం వ్యక్తం చేశారు. ఉత్తర నియోజకవర్గానికి చెందిన జీవీఎంసీ ఔట్సోర్సింగ్ ఉద్యోగి విద్యుత్ ఘాతంతో మృతి చెందిన ఘటన పై స్పందించిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, బాధిత కుటుంబాన్ని జీవీఎంసీ తరఫున ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే దొండపర్తి లోని జీవీఎంసీ కమ్యూనిటీ హాల్‌లో ఒక కార్యక్రమానికి హాజరైన సమయంలో పెచ్చులు పడి చెట్ల బాలకృష్ణ అనే వ్యక్తి వెన్నెముకకు (డిస్క్) తీవ్ర గాయ మై సుమారు రూ.8 లక్షల వరకు వైద్య ఖర్చులు అయ్యాయని పేర్కొంటూ, అతని ఫిజియోథెరపీ చికిత్సకు సహాయం అందించాలని మేయర్, కమిషనర్ దృష్టికి ఈ అంశాన్ని తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బడ్జెట్ సమావేశం నగర అభివృద్ధికి దోహదపడే కీలక నిర్ణయాలకు వేదికగా నిలిచిందని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు.

# జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు జైషే ఉగ్రవాదుల హతం..







**ఉదంపూర్:** జమ్మూ కశ్మీర్ లోని ఉదంపూర్ జిల్లా అటవీ ప్రాంతంలో బుధవారం నాడు ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో పాక్ కు చెందిన ఇద్దరు జైషే మమ్మద్ ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టు బెట్టాయి. వీరిలో ఒకరిని ఈ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా చురుకుగా పనిచేస్తున్న 'జైషే' టాప్ కమాండర్ అవు మావియాగా, మరొకరిని జబ్బర్ అనే ఉగ్రవాదిగా గుర్తించినట్టు అధికారులు తెలిపారు. 'కియా' పేరుతో భద్రతా బలగాలు ఈ ఆపరేషన్ చేపట్టగా, ప్రస్తుతం ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది. అధికారుల సమాచారం ప్రకారం, జైషేకు చెందిన ఇద్దరు ఉగ్రవాదులకు సంబంధించిన సమాచారం అందడంతో భద్రతా దళాలు, సీఆర్‌పీఎఫ్ బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. మిలిటెంట్లు కాల్పులు జరుపుతూ అక్కడి నుంచి పారిపోయారు. నిఘా డ్రోన్ వారిని ఒక గుహలో దాక్కుకున్నట్టు గుర్తించడంతో భద్రతా బలగాలు చుట్టుముట్టి కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. గుహ మొదట్లో ఒక ఉగ్రవాది, గుహలోపల మరొక ఉగ్రవాది మృతదేహాలను గుర్తించినట్టు అధికారులు తెలిపారు. వారి నుంచి ఒక ఎం–4 కార్బైన్, ఒక ఏకే–47 రైఫిల్, మరికొన్ని ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

# ఎమ్మెల్యే బండారు కృషితో ఎమ్జీఎన్ఆర్జీఈఎస్ నిధులు.



**కొత్తపేట, పెన్ సత్తా, ఫిబ్రవరి 04:** నియోజకవర్గా నికి ఎమ్జీఎన్ఆర్జీఈఎస్ నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు. కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించినట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి 54 పనులకు గాను, రూ.13.85 కోట్లను ఎమ్జీఎన్ఆర్జీఈఎస్ నిధులు మంజూరు అయ్యాయని బుధవారం ఆయన తెలిపారు. నిధులు మంజూరు పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఆత్రేయపురం మండలానికి రూ.3.15 కోట్ల నిధులు, రావులపాలెం మండలానికి రూ.3.60కోట్లు, కొత్తపేట మండలానికి రూ. 3.22 కోట్లు, ఆలమూరు మండలానికి రూ. 3.88 కోట్లు నిధులు మంజూరు అయ్యాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నిధులు మంజూరు చేసిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# త్రికోటేశ్వర స్వామి తిరునాళ్ల ఏర్పాట్ల పై ఆనం సమీక్ష



**పల్నాడు, పెన్ సత్తా, ఫిబ్రవరి 04:**కోటప్పకొండలో ఈ నెల 15 న జరగనున్న త్రికోటేశ్వర స్వామి తిరునాళ్ల ఏర్పాట్ల పై సహచర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించడం జరిగింది. తిరునాళ్లకు తరలివచ్చే వేలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణను పక్కాగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా వీరు త్రికోటేశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. భక్తుల భద్రత, సౌకర్యాలే ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని స్పష్టం చేశాను.

# మానసిక వికాసంతో కూడిన విద్యా నైపుణ్యాలను అవలంబించు కోవాలి

★ సివి రామన్ టాలెంట్ టెస్ట్ విజేతల బహుమతి ప్రధాన కార్యక్రమంలో చింతమనేని



**హైదరాబాద్, పెన్ సత్తా, ఫిబ్రవరి 04:**విద్యార్థుల్లో చిన్నతనం నుంచే జీవిత లక్ష్యాలను ఎంపిక చేసుకోవడంతో పాటు వాటి సాధన కై కృషి చేయడం ఎంతో అభినందనీయమని, మానసిక వికాసం తో కూడిన విద్యా నైపుణ్యాలను పిల్లలు అవలంబించు కోవాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ లోని ప్రఖ్యాత రవీంద్ర భారతి ఆడిటోరియంలో సుచీర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన సర్ సివి రామన్ టాలెంట్ టెస్ట్ విజేతల బహుమతి ప్రధాన కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ప్రముఖ సినీ నటులు శ్రీకాంత్, శివాజీ రాజా తో కలిసి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

కార్యక్రమంలో భాగంగా జ్యోతి ప్రజ్వలన అనంతరం విజేతలకు మెమెంటోలను ప్రధానం చేశారు. అనంతరం విజేతలను ఉద్దేశించి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రసంగించారు. సర్ సివి రామన్ టాలెంట్ టెస్ట్ నిర్వహించి దాదాపు 300 మందిని ఎంపిక చేసి అభినందించడం సుశీర్ ఇండియా ఫౌండేషన్ చేస్తున్న మంచి కార్యక్రమంగా, జీవితంలో నిర్దిష్ట లక్ష్యసాధనతో ప్రతి ఒక్కరు కూడా ముందుకు సాగాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులతో పాటు, విద్యార్థులు, తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్ సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి

★ బడ్జెట్ పత్రాలను దగ్ధం చేసిన అంగన్వాడీలు.





**పరవాడ, పెన్ సత్తా, ఫిబ్రవరి 04:** ప్రజా వ్యతిరేక, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక కేంద్ర బడ్జెట్ కాపీల్ని లంకెలపాలెం, పరవాడ రోడ్డు పై తాసిల్దార్ కార్యాలయం ఎదుటదగ్ధం చేసి, సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం పరవాడ తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 53 లక్షల కోట్ల బడ్జెట్ లో కార్మికులకు మొండి చేయి చూపారని. కార్మికులు వేతనాలకు ప్రస్తావన లేదని. ఐసిడిఎస్ కి నిధులు పెంచలేదని, ప్రభుత్వ పథకాలలో కోత పెట్టడం వలన కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని. మరోవైపు పెట్టుబడిదారులకు, సంపన్న వర్గాలకు రాయితీలు ఇచ్చారని. వ్యవసాయం, గ్రామీణ ఉపాధి ఈ బడ్జెట్ వల్ల దెబ్బతింటుందని. కార్పొరేట్ కంపెనీలు లాభాల కోసం సంవత్సరాల తరబడి రాయితీలు ప్రకటించారని. ఇది పూర్తిగా కార్పొరేట్ బడ్జెట్ తప్ప, ప్రజా సంక్షేమం విస్మరించిన బడ్జెట్ అని కావున ఈ బడ్జెట్ ని ప్రజలందరూ వ్యతిరేకించాలని గని శెట్టి పిలుపునిచ్చారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నిరసన తెలియజేసి బడ్జెట్ ప్రతులను దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిహెచ్ దేవి, కే రమణి, సుజాత, అరుణ, పార్వతి, వర వెంకటి, ఆర్.వి, తదితరులు పాల్గొన్నారు.

# రెవిన్యూ పిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి.





★ రీ సర్వే తప్పులను సరిదిద్దాలి, రీ వెరిఫికేషను తరువాత పిర్యాదులు వస్తే కఠిన చర్యలు.
★ తప్పులు లేని పట్టాదారు పాసుపుస్తకాలు అందించాలి.
★ నూరుశాతం నీటి తీరువా వసూలు చేయాలి జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్.

**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 04:** రీ సర్వేలో వచ్చిన పిర్యాదుల పై రీ వెరిఫికేషను చేసి సరిచేసి, తప్పులు లేని పట్టాదారు పాసుపుస్తకాలను ప్రజలకు అందించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తహశీల్దార్లను ఆదేశించారు. రీసర్వే, రీ వెరిఫికేషను, పి.జి.ఆర్.ఎస్., రెవిన్యూ క్లినిక్, పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ, నీటితీరువా, సివిల్ సప్లయి తదితర అంశాల పై కలెక్టరు కార్యాలయం నుండి తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టరు సమీక్ష నిర్వహించారు.

సమీక్షా సమావేశంలో రెవిన్యూ సంబంధిత అంశాల పై మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ రీసర్వే లో వచ్చిన పిర్యాదుల పై వెంటనే చర్యలు తీసుకోవాలని, రీ వెరిఫికేషను తరువాత పేరు, సర్వే నెంబరు, విస్తీర్ణం వివరాలలో తప్పులు లేని పాసుపుస్తకాలను భూ యజమానులకు అందించాలని జిల్లా కలెక్టరు తెలిపారు. రీ-వెరిఫికేషనులో క్షేత్ర స్థాయి అందికారులు పంపిన నివేదిక లోని వివరాలను సరిచూసుకొని సంతృప్తి పొందిన తరువాత మాత్రమే తహశీల్దార్లు రిపోర్టు పంపించాలని, రీ-వెరిఫికేషను తరువాత భూసంబంధిత వివరాలు, పాసుపుస్తకాలలో తప్పులు వస్తే సంబంధిత అధికారుల పై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పి.జి.ఆర్.ఎస్., రెవిన్యూ క్లినిక్ ద్వారా వచ్చే పిర్యాదులను నిర్ణీత గడువు లోగా పరిష్కరించి, వివరాలను పిర్యాదు దారునికి తెలియజేయాలని, ఎండార్సుమెంటు కాపీ అందజేయాలని జిల్లా కలెక్టరు తెలిపారు. జిల్లాలో వివిధ విడతలలో చేపట్టిన రేసర్వే పనులు షెడ్యూలు ప్రకారం పూర్తి చేయాలన్నారు. రీ సర్వే సమయంలో రీ సర్వే, భూవ్ని వివరాలను భూయజమానులకు తప్పని సరిగా తెలియజేయాలని, అందుకు అన్ని రకాల మార్గాలను వినియోగించుకోవాలన్నారు. రీ సర్వేలో ప్రభుత్వ భూముల వివరాలను తప్పని సరిగా రికార్డులలో నమోదు చేయాలని తెలిపారు. రీ సర్వే పూర్తయిన గ్రామాలలో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ పూర్తి చేయాలన్నారు. నీటి తీరువా వసూలు పూర్తి చేయాలని, గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించి శతశాతం చెల్లింపులు జరిగేలా వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. సివిల్ సప్లయికి సంబంధించి డిజిటల్ కార్డులన్నింటిని పంపిణీ పూర్తి చేయాలని, లక్ష్యం మేరకు రేషను షాపులు నెలవారీ తనిఖీలు చేయాలని, దీపం పథకానికి సంబంధించిన డబ్బులు పడని ఖాతాలకు డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

# కుటుంబ సర్వే వేగవంతం కావాలి.





★ అక్షరాంధ్ర లక్ష్యాలను సాధించాలి.
★ వీడియో కాన్ఫరెన్స్ లో స్పష్టం చేసిన జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్.

**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 04:** వచ్చే రెండు రోజుల్లో ఫామిలీ సర్వే పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ కుటుంబ సర్వే, అక్షర ఆంధ్ర, ఈ.పి.టి.ఎస్ అప్లోడ్ తదితర కార్యక్రమాల పై వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా మండల వారీగా ఎంపీడీఓల తో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గృహ సర్వే గడువు లోపలే శత శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు 72 శాతం పూర్తయిందని, దీనిని ప్రాధాన్యతా కార్యక్రమంగా భావించి పూర్తి చేయాలన్నారు. అక్షరాంధ్ర కార్యక్రమం క్రింద జిల్లాలో 89,944 మంది నిరక్షరాస్యులను గుర్తించామని, వారందరినీ వాలంటీర్ల తో మ్యాప్ చేసి అక్షరాస్యులుగా దిద్దే కార్యక్రమం వెంటనే జరగాలని, మార్చి నెలలో నిర్వహించే ప్రత్యేక పరీక్షకు సిద్ధం చేయాలని తెలిపారు. ఇప్పటికే వారికి అవసరమగు పుస్తకాలు, పెన్సిళ్లు తదితర సామగ్రి వచ్చిందని, అక్షరాస్యత కార్యక్రమాలు వేగంగా జరిగేలా చూడాలని డి.ఆర్.డి. డ్వామా, ఎస్ జి ఎస్ డబ్ల్యు శాఖల జిల్లా అధికారులకు ఆదేశించారు. జిల్లాలో వాలంటీర్ల రిజిస్ట్రేషన్ శతశాతం జరపాలని అధికారులను ఆదేశించారు. ఈ.పి.టి.ఎస్ వెబ్సైట్ నందు కార్యాలయాల నుండి జారీ చేసిన, కార్యాలయాలకు అందిన డాక్యుమెంట్లను ప్రతి కార్యాలయం నుండి ప్రతి రోజూ అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రతి ఉద్యోగి నెలలో కనీసం 3 నుండి 5 ఉద్యోగి సామరర్థ్యం పెంచే కోర్స్ లను ఐ గాట్ కర్మ యోగి పోర్టల్ నందు శిక్షణ పొందవలసినదిగా ఉద్యోగుల ను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డి ఆర్డి ఎ, డ్వామా పథక సంచాలకులు శచి దేవి, పూర్ణిమ దేవి, ఎస్ జి ఎస్ డబ్ల్యు సమన్వయ అధికారి ఎస్ మంజుల వాణి, వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా అన్ని మండలాల ఎంపీడీఓ లు, నర్సీపట్నం, యలమంచిలి, అనకాపల్లి మున్సిపాల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపికయిన బాడీ బిల్డర్ మధు





**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 04:**జీవీఎంసీ 84 వ వార్డ్ కొత్తూరు నర్సింగరావు పేట ప్రాంతాలు చెందిన బాడీ బిల్డర్ మధు గత ఏడాది రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన పోటీల్లో మిస్టర్ ఆంధ్రగా గెలుపొందారు. ఈ ఏడాది నేషనల్ బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల ఫిబ్రవరి 1 న ఒరిస్సా, చత్తీస్గడ్ రాష్ట్రంలో జరిగిన నేషనల్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ 55బి60 కేజీల క్యాటగిరిలో జాలారి మధు పోటీల్లో తృతీయ స్థానం గెలుపొందారు. గెలుపొందిన తర్వాత గ్రామానికి వచ్చిన మధుకు బుధవారం కొత్తూరు నర్సింగరావుపేట లో ఉన్న నాచురల్ ఫిట్నెస్ జిమ్ సభ్యులు, కోచ్ షరీఫ్, అథ్లెటిక్ ఛాంపియన్ ప్రసాద్ లు వారి యొక్క జిమ్ లో ఏర్పాటు చేసి సన్మాన కార్యక్రమంలో మధు కి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు

# బత్తుల తాతయ్య బాబుకి శుభాకాంక్షలు తెలిపిన పరవాడ టీడీపీ నాయకులు

**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 04:** జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులుగా బత్తుల తాతయ్య బాబు ప్రమాణస్వీకారం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేేస్తూ పూలమాల, సాలువాతో సత్కరించిన పరవాడ మండలం నాయకులు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు మాసవరపు అప్పలనాయుడు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వియ్యపు చిన్నా కలిసి తాతయ్య బాబు ని సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కలిదిండి రామకృష్ణ రాజు, పెదపూడి ముకేష్, వియ్యపు రమేష్, పరవాడ మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది జరిగింది.



# ఆల్ఫాబెట్ బెంగళూరులో భారీ కార్యాలయ ఏర్పాటు







**ఇంటర్నెట్ డెస్క్:** గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ బెంగళూరులో భారీ కార్యాలయ స్థలాన్ని లీజుకు తీసుకుంది. ఇది 20,000 మంది ఉద్యోగులకు సరిపడే భారీ ఆఫీస్ స్పేస్ ఇది. హెచ్ 1 బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచడం, ఈ ప్రాసెస్ మరింత కఠినతరమౌతున్న నేపథ్యంలో– భారత్ లోనే తన కార్యకలాపాలను మరింత విస్తరించాలని ఆల్ఫాబెట్ నిర్ణయించింది. దీనికి అనుగుణంగా ఇక్కడే కొత్త నియామకాలను చేపట్టబోతోంది. విదేశీ నిపుణుల పై ఆధారపడటాన్ని తగ్గించు కోనుంది. కఠినమైన హెచ్ –1 బి వీసా విధానాల వల్ల అమెరికాలో విదేశీ నిపుణుల నియామకం చాలా ఖరీదు, సంక్లిష్టంగా మారిన విషయం తెలిసిందే. దీంతో గూగుల్ భారత్ లోనే తన కార్యకలాపాలను విస్తరించడం మొదలు పెట్టిందని బ్లూమ్‌బెర్గ్ తెలిపింది. దీని పై ఓ ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. బెంగళూరు శివార్ల లోని వైట్‌ఫీల్డ్ టెక్ కారిడార్‌లో ఆఫీస్ స్పేస్ ను లీజుకు తీసుకుంది గూగుల్. ఇది క్రమంగా గ్లోబల్ వర్క్‌ఫోర్స్‌కు కీలక వృద్ధి కేంద్రంగా మార్చబోతోంది. వైట్‌ఫీల్డ్ టెక్ కారిడార్ అలెంబిక్ సిటీలో ఏకంగా ఓ ఆఫీస్ టవర్ ను లీజుకు తీసుకుంది. అదనంగా మరో రెండు టవర్ల కోసం ప్రయత్నాలు చేపట్టింది. ఈ మూడింట్లో కలిపి దాదాపు 2.4 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులో ఉంటుంది. మొదటి టవర్ త్వరలో వినియోగం లోకి రానుంది. మిగిలిన టవర్లు వచ్చే ఏడాది పూర్తవుతాయి. సుమారు 6,50,000 చదరపు అడుగుల విస్తీర్ణం గల ఓ టవర్ ను లీజుకు తీసుకున్నట్లు ఆల్ఫాబెట్ ధృవీకరించిందని బ్లూమ్‌బెర్గ్ తెలిపింది. అదనపు స్థలం గురించి ఇంకా వెల్లడి కాలేదని వివరించింది. ప్రస్తుతం ఆల్ఫాబెట్ కు భారత్ లో 14,000 మంది ఉద్యోగులు పని చేస్తోన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వర్క్ ఫోర్స్ సంఖ్య 1,90,000 లకు పైమాటే. బ్లూమ్‌బెర్గ్ కథనం ప్రకారం– ఈ మూడు టవర్లను కూడా ఆల్ఫాబెట్ పూర్తిగా వినియోగిస్తే, బెంగళూరు క్యాంపస్ 20,000 అదనపు ఉద్యోగులకు వసతి కల్పిస్తుంది. ఇది దేశంలో వారి ఉద్యోగుల సంఖ్యను రెట్టింపు చేస్తుంది. హెచ్ –1 బి వీసా కోసం లక్ష డాలర్లను చెల్లించడానికి బదులుగా భారత్ లోనే తన సంస్థ కార్యకలాపాలను విస్తరించడానికి గూగుల్ ప్రాధాన్యత ఇస్తోందని బ్లూమ్ బెర్గ్ తెలిపింది. బెంగళూరు లోని ఐటీ ఉత్పత్తిలో వైట్‌ఫీల్డ్ వాటా దాదాపు 22 శాతం. దేశంలోని అతి ముఖ్యమైన టెక్ క్లస్టర్‌లలో ఇది టాప్ లో ఉంటోంది. ఆల్ఫాబెట్ గత సంవత్సరం నగరంలో తన అతిపెద్ద క్యాంపస్ ను ప్రారంభించింది. క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, చిప్ డిజైన్, మెషిన్ లెర్నింగ్‌తో సహా వందలాది ఉద్యోగాలు ఇక్కడ పని చేస్తోన్నారు. దీన్ని మరింత విస్తరించాలని, ఏకంగా 20,000 మందిని కొత్తగా తీసుకోవాలని నిర్ణయించిందని బ్లూమ్ బెర్గ్ పేర్కొంది.

# నువ్వు ఒక చెత్త రిపోర్టర్ మహిళా జర్నలిస్ట్ పై ట్రంప్ ఆగ్రహం..





**ఇంటర్నెట్ డెస్క్:** సీఎన్ఎన్ ఛానల్ కు చెందిన ఓ మహిళా రిపోర్టర్ పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్ష భవనం లోని ఓవల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీఎన్ఎన్ ఛానెల్ కు చెందిన కైట్లాన్ కొల్లిన్స్ అనే మహిళా జర్నలిస్ట్ పై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎన్ఎన్ ఛానల్ కు చెందిన ఓ మహిళా రిపోర్టర్ పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్ష భవనం లోని ఓవల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీఎన్ఎన్ ఛానెల్‌కు చెందిన కైట్లాన్ కొల్లిన్స్ అనే మహిళా జర్నలిస్ట్ పై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నువ్వు ఒక చెత్త రిపోర్టర్ వి అంటూ విమర్శించారు. నేను గత పదేళ్లుగా మిమ్మల్ని చూస్తున్నాను. మీరు నవ్వడం ఇప్పటివరకు ఒక్కసారి కూడా చూడలేదు. మీలాంటి రిపోర్టర్ల వల్లనే సీఎన్ఎన్ రేటింగ్ పడిపోతోంది, మీరు నిజాలు ఎప్పుడూ చెప్పరు, ఆ విషయం మీకు కూడా తెలుసు, అందుకే మీరు ఎప్పుడూ సీరియస్‌గా ఉంటారన్నారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో నా పేరుతో పాటు చాలా మంది పేర్లను కుట్రపూరితంగా విడుదల చేశారు. అలాంటి వాటి గురించి కాకుండా దేశం మొత్తం గురించి ఆలోచిస్తే మంచిది అని ట్రంప్ పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ ఫైల్స్ కుంభకోణం దర్యాప్తునకు సంబంధించిన ఫైల్స్ ను అమెరికా న్యాయశాఖ తాజాగా విడుదల చేసింది. ఈ ఫైల్స్ లో అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్, మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్, ఎలన్ మస్క్, పాప్ స్టార్ మైఖేల్ జాక్సన్ ల ప్రస్తావన, వారి ఫొటోలు బయటపడ్డాయి. ఆ ఫైల్స్ లో డొనాల్డ్ ట్రంప్ పేరు కూడా ఉన్నట్టు వార్తలు వచ్చాయి. తాజాగా జరిగిన విలేకరుల సమావేశంలో ట్రంప్ ను దీని గురించే జర్నలిస్ట్ ప్రశ్నించారు.

# పరీక్షా సమాధాన పత్రాలు పరిశీలించిన ఎం ఈ వో





**నక్కపల్లి, పెన్ సత్తా ఫిబ్రవరి04:**మండలంలో పదవతరగతి విద్యార్థుల స్లిప్ టెస్ట్ సమాధాన పత్రాలను మండలవిద్యాశాఖాధికారి1 కే.నరేష్, 2 రుత్తల నాగన్నదొరలు సమగ్రంగా పరిశీలించారు. బుధవారం నక్కపల్లి హైస్కూల్లో పరీక్ష పత్రాల మూల్యాంకనం అనంతరం విద్యార్థులకు ఇచ్చి విశ్లేషణ చేయాలన్నారు. ఏయే అంశాలలో వెనుకబడియున్నారో వాటిపై ప్రత్యేకశ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించేలా చూడాలని,ఉపాధ్యాయులు రాత్రివేళ ఇంటివద్ద ఫోన్ లు ద్వారాగానీ, ఇండ్లకు వెళ్ళి గాని మోనిటరింగు చేయాలని సూచించారు.

ఆకట్టుకున్న క్రాఫ్ట్ ప్రదర్శనలు

నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు పి విజయ ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ మోడల్ లో తయారుచేసిన ఆర్ట్ కళా ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. వీటన్నిటిని మండల విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టివి రమణ, రాజశేఖర్, సత్యవేణి తదితరులు ఉన్నారు.

# రహదారుల రూపకల్పనకు నిర్మాణాత్మకమైన కృషి

బాపట్ల శాసనసభ్యులు నరేంద్ర వర్మ రాజు వెల్లడి

**బాపట్ల, పెన్ సత్తా, ఫిబ్రవరి 4 :**బాపట్ల నియోజకవర్గంలోని తీర ప్రాంత గ్రామాలకు మహర్దశ కలిగింది.శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు సూచన మేరకు ప్రధాన రహదారులకు నిధులు కేటాయించారు.కర్లపాలెం మండలం పేరలి గ్రామం నుండి తుమ్మలపల్లి వరకు వయా పేర్లమ్మ ఆలయం వరకు రహదారి నిర్మాణానికి 2 కోట్ల రూపాయల నిధులు మంజూరైనట్లు శాసనసభ్యులు నరేంద్ర వర్మ రాజు వెల్లడించారు.

కొన్ని దశాబ్దాలుగా ప్రజలు పడుతున్న ఆందోళనపై స్పందించిన శాసనసభ్యులు నరేంద్ర వర్మ రాజు చేసిన కృషి ఫలితంగా ఒక చక్కటి రహదారికి మార్గం సుగమం అయింది.బాపట్ల మండలం పూండ్ల రహదారి నుండి మర్రిపూడి గ్రామంలోని మాలపల్లి వరకు 81 లక్షల రూపాయలతో రహదారి నిర్మించనున్నారు.ఈ రహదారుల నిర్మాణానికి నిధులను మంజూరు చేయటంలో సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బాపట్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.గతంలో నియోజకవర్గంలో అనేక రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.తిరిగి మరో రెండు రోడ్లకు నిధులు మంజూరు అయ్యాయని వెల్లడించారు.నియోజకవర్గంలో దశాబ్దాల తరబడి అమలుకు నోచుకోని రహదారులకు యుద్ధ ప్రాతిపదికపై చర్యలు తీసుకొని అందమైన రహదారుల రూపాకల్పన చేస్తామని చెప్పారు.మరికొన్ని రహదారుల నిర్మాణానికి ఇప్పటికే ప్రతిపాదనలు చేసి ఉన్నామని వెల్లడించారు.త్వరలోనే ఆయా రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు అవుతాయని తెలియజేశారు.గుంతలు లేని రహదారులు నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.



# ఉపమాక శివాలయం రోడ్డుకు హెటిరో సిఎస్ఆర్ నిధులు





**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 04:**మండలంలో ఉపమాక గ్రామం శివాలయం వీధిలో హెటిరో పరిశ్రమ సి ఎస్ ఆర్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి స్థానిక నాయకులు కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు. బుధవారం హెటిరో సి ఎస్ ఆర్ ఉద్యోగి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నక్కపల్లి పిఎసిఎస్ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, స్థానిక వైసీపీ నాయకులు కొల్లాటి బుజ్జి, కొప్పిశెట్టి హరిబాబు, కూటమి నాయకులు గోసల తాతారావు, జగదీష్, తోలేటి శ్రీను తదితరులు కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ ఉపమాక గ్రామ అభివృద్ధికి హెటిరో యాజమాన్యం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ సంస్థ ద్వారా గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారని తమ గ్రామ అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న హిటిరో పరిశ్రమ అధినేత బండి పార్థసారధి రెడ్డికి గ్రామ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

## నేడు ఉమాక వెంకన్న సన్నిధిలో చాగంటి ప్రవచనాలు



**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 04:** ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు జరగనున్నాయి. దీనికి సంబంధించి ఆలయం వద్ద హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు సభా ప్రాంగణం ఏర్పాట్లను బుధవారం స్థానిక కూటమి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా నక్కపల్లి పీఏసీఎస్ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో చాగంటి ప్రవచనాలు ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక అన్నారు. రాష్ట్ర హోం మంత్రి అనిత చొరవతో ప్రజల కోరిక తీరబోతుందన్నారు. గురువారం సాయంత్రం 5 గంటలకు చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాల కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం పై అన్ని రకాలుగా ప్రచారం చేయడం జరిగిందని చుట్టుపక్కల గ్రామాల నుండి భారీ స్థాయిలో ప్రవచనాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. దీనికి సంబంధించి ఎవరికి ఇటువంటి ఇబ్బందులు లేకుండా భారీ ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. సభా ప్రాంగణంలో సౌండ్ సిస్టం ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వ్యక్తిగత కార్యదర్శి వేణు, స్థానిక నాయకులు ఉన్నారు.

# నేషనల్ స్పేస్ సొసైటీ ప్రాజెక్టులో బాపట్ల నారాయణ ఘనవిజయం



**బాపట్ల, పెన్ సత్తా, ఫిబ్రవరి 4 :**నేషనల్ స్పేస్ సొసైటీ ప్రాజెక్టు నందు ప్రపంచవ్యాప్తంగా 35 దేశాలలో 7,000 ప్రాజెక్టుల నేను నందు ప్రపంచ స్థాయిలో నిర్వహించిన పోటిల్లో రెండో స్థానంలో 9 వ తరగతి విద్యార్థులు చరణ్ శివ సాయి, రిషికేష్, శశిధర్, గౌతమ్ నందన్ లు కలిసి తయారు చేసిన ప్రాజెక్టు సెలెస్టియల్ హార్వెస్ట్ లో ద్వితీయ స్థానం సాధించారు.ఈ సందర్భంగా ఏటీఏం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నారాయణ విద్యా సంస్థల్లో బాపట్ల నారాయణ విద్యా సంస్థ ఇది రెండోసారి అని అన్నారు.ప్రిన్సిపాల్ భాగ్యరాణి మాట్లాడుతూ స్కూల్ విద్యార్థులు ఈ ప్రాజెక్టు లో ఘనత సాధించడం గర్వకారణంగా ఉందని, ఇటువంటి ప్రాజెక్టులు మరిన్ని చేసి స్కూల్ కి మరియు తల్లిదండ్రులకి మంచి పేరు తీసుకురావాలని కోరారు.ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఏజీఏం వెంకటేశ్వర్లు, రామకృష్ణ శర్మ, కో – ఆర్డినేటర్ తిరుమలరావు, అకాడమీ టీమ్ రవీంద్ర బాబు, ఉపాధ్యాయురాలు కీర్తి సంతోష్, ఎన్ ఎస్ ఎస్ ఇంచార్జ్ గోపి, పదవ తరగతి ఇంచార్జ్ సాంబశివరావు, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల ప్రచార కమిటీ నియామకం

- వివరాలు వెల్లడించిన తుంబూరు దయాకర్ రెడ్డి
- కన్వీనర్ గా మద్దినేని బేబీ స్వర్ణ కుమారి, కో కన్వీనర్లుగా బైరు హరినాథ్ బాబు, రామ్మూర్తి నాయక్ నియామకం



**ఏదులాపురం పెన్ సత్తా, ఫిబ్రవరి 4** ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల పర్వంలో కాంగ్రెస్ పార్టీ తమ ప్రచార వ్యూహాలకు పదును పెట్టింది. ఈ మేరకు మున్సిపాలిటీ పరిధిలో పార్టీ ప్రచార కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు ప్రత్యేక కమిటీని నియమించినట్లు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి వెల్లడించారు.

ప్రచార కమిటీ కన్వీనర్‌గా మద్దినేని బేబి స్వర్ణకుమారిని, కో-కన్వీనర్లుగా బైరు హరినాథ్ బాబు, రామ్మూర్తి నాయక్ లను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. కమిటీ సభ్యులుగా కళ్ళెం వెంకటరెడ్డి, గోనె భుజంగ రెడ్డి, బానోత్ కిషోర్, గణపారపు వీరన్న,అంబటి సుబ్బారావు, వెంపటి రవి, అజ్మీర అశోక్ నాయక్, షేక్ హుస్సేన్ , బాధ్యతలు నిర్వహించనున్నారు. పార్టీ శ్రేణులను ఏకోన్ముఖులను చేస్తూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేలా ఈ కమిటీ కృషి చేయనుందని దయాకర్ రెడ్డి తెలిపారు.

## చిన్నతనం నుంచే పిల్లలకు మంచి విలువలు అందించాలి.....

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ
- గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై పిల్లలకు చిన్నతనం నుంచే అవగాహన
- జాతీయ బాలికల దినోత్సవ వేడుకలలో పాల్గొన్న అదనపు కలెక్టర్




**ఖమ్మం పెన్ సత్తా, ఫిబ్రవరి 4**చిన్నతనం నుంచే పిల్లలకు మంచి విలువలు అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మహిళా సాధికారిక కేంద్రం, మహిళా-శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని, జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాలిక దినోత్సవ వేడుకల సందర్భంగా బాలల సదనం పిల్లలు స్వాగతం స్వాగతం అంటూ చేసిన నృత్య ప్రదర్శన, ఖమ్మం అర్బన్, రూరల్ ప్రాజెక్ట్ అంగన్వాడీ పిల్లలు వెల్ బేబీషో ప్రదర్శన ఆకట్టుకొనగా, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై కేజిబీవీ విద్యార్థినులు నాటక ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో చిన్నారి అనే ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి మహిళా-శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దాదాపు 1000 విద్యా సంస్థలలో పర్యటించి పిల్లలకు చిన్నతనంలోనే గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై అవగాహన కల్పించామని అన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై ప్రతి ఇంట్లో పిల్లలకు మనం అవగాహన కల్పించాలని, పిల్లలు ప్రతి విషయం మనతో పంచుకునేలా వారికి స్వేచ్ఛ కల్పించాలని అన్నారు. ఇంట్లో ఉన్న మగ, ఆడపిల్లలకు సమానంగా ఇతరులను ఎలా గౌరవించాలో నేర్పాలని అన్నారు. చిన్నతనం నుంచే సెల్ ఫోన్ పిల్లలకు అలవాటు చేయవద్దని అన్నారు. పిల్లల పెంపకం లోని ప్రతి దశలో తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలని అదనపు కలెక్టర్ అన్నారు. చిన్నతనం లోనే పిల్లలను క్రమశిక్షణలో పెట్టాలని అన్నారు. పిల్లలకు మంచి చదువుతో పాటు సంస్కారం కూడా ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉంటుందని అన్నారు. పిల్లలకు చిన్నతనం నుంచే ఇతరులను గౌరవిస్తూ సమానత్వంతో ఎలా జీవించాలో నేర్పాలన్నారు. పిల్లలు మన ప్రవర్తన నుంచి చాలా నేర్చుకుంటారని, ఇంట్లో మనం సమానత్వం పాటిస్తే పిల్లలు అది చూసి వారు అలాగే జీవిస్తారని అదనపు కలెక్టర్ తెలిపారు. మన ఇంట్లో పిల్లల మధ్య ఎటువంటి బేధ భావం చూపించకుండా పెంచాలని అదనపు కలెక్టర్ సూచించారు. అనంతరం గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై సమావేశంలో అదనపు కలెక్టర్ చర్చించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి వేల్పుల విజేత, సిడబ్ల్యుసి చైర్మన్, ప్రతినిధులు, సిడిపిఓ., డి.హెచ్.ఈ.డబ్ల్యూ సమీన్, సంబంధిత అధికారులు, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

## టేకులపల్లి డెకరేషన్, లైటింగ్ సౌండ్ సిస్టం యూనియన్ ఎన్నిక...

అధ్యక్షుడిగా గుమ్మడోజు తిరుపతి



**ఇల్లందు నియోజకవర్గ పెన్ సత్తా, ఫిబ్రవరి 4**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల డెకరేషన్, లైటింగ్, సౌండ్ సిస్టం యూనియన్ ను ఎకగ్రీవంగా బుధవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. డెకరేషన్ యూనియన్ లో 38మంది సభ్యులు సమావేశంలో ఏర్పాటు చేసుకున్నారు. డెకరేషన్, లైటింగ్, సౌండ్ సిస్టం అధ్యక్షుడిగా గుమ్మడోజు తిరుపతి, ఉపాధ్యక్షుడు గుగులోత్ సురేందర్, ప్రధాన కార్యదర్శి ఈసం రాజేష్, కార్యదర్శి భూక్య కిషన్, కోశాధికారి ఊకే లక్ష్మయ్య, కార్యవర్గ సభ్యులు .జాల మురళి, నల్లమాస శంకర్ గౌడ్, ధరవత్ లాలు, మాదే అనిల్ కుమార్, సిలివేరు శ్రీనివాస్, ధరవత్ సురేష్, భూక్య వెంకీ,కుమార్, దొడ్డ వెంకటేశ్లను ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లు, పెన్నులు పంపిణీ




**బాపట్ల, పెన్ సత్తా, ఫిబ్రవరి 4 :**బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెం ఏపీ మోడల్ పాఠశాలలో పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ చదువుతున్న 227 విద్యార్థులకు మరియు చీరాల పట్టణం పేరాలలోని ఆంధ్రరత్న పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 53 మంది విద్యార్థులకు కృతి ఫౌండేషన్ సహకారంతో బుధవారం పరీక్ష ప్యాడ్ లు మరియు పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కృతి ఫౌండేషన్ చైర్మన్ ఆకురాతి వెంకట అశ్విని, స్టేట్ కో - ఆర్డినేటర్ ఉడతా చంద్రశేఖర్, కరేడు కో - ఆర్డినేటర్ బొమ్మిశెట్టి యశ్వంత్, చీరాల వాలంటీర్ పుష్ప సాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పదవ తరగతి, ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ఉన్నత స్థాయికి చేరుకోవడమే తల్లిదండ్రులకు ఇచ్చే అతి పెద్ద బహుమతి
- నాణ్యమైన విద్యతో ప్రభుత్వ గురుకులాలకు పెరుగుతున్న ప్రజాదరణ
- తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో నిర్వహించిన సోషల్ జస్టిస్ డే వేడుకలలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



**ఎర్రుపాలెం(పెన్ సత్తా, ఫిబ్రవరి 4**

పిల్లలు ఉన్నత స్థాయికి చేరుకోవడమే తల్లిదండ్రులకు ఇచ్చే అతిపెద్ద బహుమతి అని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.

బుధవారం ఎర్రుపాలెం మండలంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఎర్రుపాలెం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, విద్యార్థినిలతో కలిసి కలెక్టర్ సామాజిక ప్రతిజ్ఞ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ కుల వివక్ష లేని సమాజంగా తెలంగాణలో నిర్మించే దిశగా ప్రభుత్వం సామాజిక ఆర్థిక సర్వేను విజయవంతంగా నిర్వహించి, రిపోర్టును ఫిబ్రవరి 4, 2025న అసెంబ్లీలో ప్రవేశ పెట్టిందని అన్నారు.

కుల, మత విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని అన్నారు. గురుకులాల్లో చదివే పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించేందుకు డైట్ చార్జీలను 40 శాతం పెంచడం జరిగిందని, పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్య అందించడం కోసం సమీకృత గురుకులాల నిర్మాణం చేపట్టిందని అన్నారు. సామాజిక న్యాయం ఉన్న సమాజాన్ని తయారు చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తుందని అన్నారు. ప్రభుత్వం కల్పించే సదుపాయాలను వినియోగించుకుంటూ పిల్లలు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకుంటే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని కలెక్టర్ అన్నారు.

పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వం లక్షలు, కోట్ల రూపాయలు ఖర్చు చేసి మంచి విద్యాసంస్థలు ఏర్పాటు చేయడమే కాకుండా విద్యార్థులకు అవసరమైన డైట్, కాస్మొటిక్ ఛార్జీలు, ఇతర మౌళిక వసతులు మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టిందని అన్నారు.

ప్రభుత్వ గురుకులాలకు ప్రజల నుంచి మంచి డిమాండ్ ఉందని అన్నారు. మంచి విద్యాసంస్థల్లో నేడు పిల్లలు చదువుతున్నా రని, అనేక ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన ల్యాబ్, క్రీడలు ఆడేందుకు వసతులు మన గురుకులాల వద్ద ఉన్నాయని తెలిపారు. పిల్లలు ఉన్నత స్థాయికి చేరుకోవడమే తల్లిదండ్రులకు మనం ఇచ్చే అతి పెద్ద బహుమతి అవుతుందని, భవిష్యత్తులో ఎట్టి పరిస్థితుల్లో రిగ్రెట్ ఫీల్ కాకుండా ఉండాలని అన్నారు.

చదువు, క్రీడలు, మనం చేసే పనిలో పిల్లలు తమ ఎనర్జీని 100 శాతం అందించాలని అన్నారు. విజయం వెంటనే రాదని, అనేక ఓటములు, అడ్డంకులను అధిగమిస్తేనే మంచి విజయం సాధ్యం అవుతుందని అన్నారు. రాబోయే 10, ఇంటర్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటి చైర్మెన్ బండారు నరసింహారావు, ఎర్రుపాలెం మండల తహసీల్దారు ఉషా శారద , ఎంపిడివో బి. సురేందర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ప్రభుత్వ అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలి..

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- రాష్ట్రంలో మొట్టమొదటి ప్రాజెక్ట్.. సమర్థ నిర్వహణతో ఆదర్శంగా నిలవాలి
- ఎర్రుపాలెం మండలం రాజుపాలెం లో నిర్మిస్తున్న సోలార్ పవర్ ప్లాంట్ పనుల పురోగతిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ఎర్రుపాలెం పెన్ సత్తా, ఫిబ్రవరి 4** ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం ఎర్రుపాలెం మండలం, రాజుపాలెం గ్రామంలో ఇందిరా మహిళా శక్తి పథకం క్రింద నిర్మాణంలో ఉన్న ఒక మెగావాట్ సామర్థ్యపు సోలార్ పవర్ ప్లాంట్ పనుల పురోగతిని కలెక్టర్ క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ప్లాంట్‌లో జరుగుతున్న నిర్మాణ పనులు, సాంకేతిక అంశాలు, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, ప్రస్తుత పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ ఇంజనీర్స్, ప్లాంట్ నిర్మాణం, భవిష్యత్ విద్యుత్ సరఫరా అంశాలను జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, సోలార్ పవర్ ప్లాంట్ ద్వారా పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించడంతో పాటు మహిళా సాధికారతకు బలమివ్వడం పథకం యొక్క ముఖ్య లక్ష్యమని అన్నారు. త్వరలో పవర్ ప్లాంట్‌ను ప్రారంభించేందుకు అవసరమైన అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. పనుల నాణ్యతలో ఎటువంటి లోపాలు లేకుండా, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని సూచించారు. ప్లాంట్ నిర్వహణ ఎలా చేయాలనే దానిపై పూర్తి అవగాహన మహిళ సంఘాలకు కల్పించాలని ఆదేశించారు. ప్రాజెక్ట్ పై ఉన్న భయాన్ని పోగొట్టి, నమ్మకం కలిగేట్టు శిక్షణ ఇవ్వాలన్నారు. మండల సమాఖ్యకు రోజువారీ నిర్వహణపై షెడ్యూల్ ఇవ్వాలన్నారు. రిజిష్టర్ల నిర్వహణ, రీడింగ్స్ నమోదు, ప్రతిరోజు చేపట్టాల్సిన పనులపై పూర్తి అవగాహన రావాలన్నారు. ప్రతిరోజు 12 నుండి 15 వేల ఆదాయం రానున్నదని, ప్యానెల్స్ శుభ్రంగా ఉంచాలని, అన్ని నిర్వహణ జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రాజెక్ట్ ఖర్చు 1.50 కోట్లు కాగా, 2 కోట్ల ఋణం అవసరమని, ఇందులో 85 లక్షల సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుందని కలెక్టర్ అన్నారు. నిర్వహణ ఖర్చులు పోను మొదటి, రెండు సంవత్సరాలు 4 లక్షలు, మూడవ సంవత్సరం 5 లక్షలు, ప్రతి సంవత్సరం పెరుగుతూ, 11వ సంవత్సరం 10 లక్షలు, 12వ సంవత్సరం 16 లక్షలు, ఇలా 13వ సంవత్సరం నుండి ఋణం తీరగానే 40 లక్షల ఆదాయం వస్తుందని అన్నారు. 25 సంవత్సరాల వరకు ఆదాయం వస్తుంటుందని, కనీసం నిర్వహణను బట్టి, మరికొన్ని సంవత్సరాలు ఆదాయం రావచ్చని కలెక్టర్ తెలిపారు.

చైతన్య మండలి మహిళా సమాఖ్యచే నిర్వహించనున్నట్లు తెలిపారు. నిర్వహణను పకడ్బందీగా చేపట్టి, రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ ఎస్ఇ ఇనుగుర్తి శ్రీనివాసా చారి, డిఆర్డీవో కొండపల్లి శ్రీరామ్, రెడ్కో డిస్ట్రిక్ట్ మేనేజర్ పి. అజయ్ కుమార్, డిఆర్డీవో ఎపిడి జయశ్రీ, ఏడిఏ విజయచందర్, ఏఎంసి చైర్మన్ బండారు నర్సింహారావు, డిపిఎం శ్రీనివాస్, ఏపీఎం హరినాథ్, సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, చైతన్య మహిళా సంఘం బాధ్యులు వి. జ్యోతి, రత్నకుమారి, రాధ, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం.. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

- ఎర్రుపాలెంలో 50 పడకల హెల్త్ కమ్యూనిటీ సెంటర్ పనులను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ఎర్రుపాలెం,పెన్ సత్తా, ఫిబ్రవరి 4**ఎర్రుపాలెం మండల కేంద్రంలో అత్యాధునిక వైద్య వసతులతో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల హెల్త్ కమ్యూనిటీ సెంటర్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి క్షేత్రస్థాయిలో బుధవారం తనిఖీలు చేశారు. నిర్మాణ పనుల పురోగతిని పరిశీలిస్తూ, పనులు నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు సులభంగా, సమర్థవంతంగా వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నూతన హెల్త్ కమ్యూనిటీ సెంటర్ అందుబాటులోకి వస్తే, పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని అన్నారు. మాతృశిశు సంరక్షణ, అత్యవసర వైద్యం, సాధారణ చికిత్సలు, ల్యాబ్ సేవలు తదితర అన్ని సదుపాయాలు ఈ కేంద్రంలో కల్పించనున్నట్లు తెలిపారు.

నిర్మాణ పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అవసరమైన మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే, పనుల పురోగతిపై తరచూ నివేదికలు సమర్పించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్ గౌడ్, వైద్య శాఖ ఇ ఇ ఉమామహేశ్వర రావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
ప్రశ్నించడం అందరి హక్కు..
PEN SATTA Telugu Daily

# ఎడిటోరియల్

## కులగణనపై ఓబీసీల సందేహాలు..

అసలే బీసీలను బీజేపీ ప్రభుత్వం పట్టించుకుంటోంది అంతంతమాత్రమే!! ఇప్పుడు జనగణనలో కులగణనను కేంద్రం చేస్తున్నప్పటికీ ఓబీసీ కాలం క్యాస్ట్ లేకపోవడం తీరని అన్యాయం. జాతీయ జనగణనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న కులగణన డాక్యుమెంట్‌లో ఎస్సీ, ఎస్టీల కాలమ్ పెట్టినప్పటికి ఓబీసీ కాలమ్ లేకుండా కులం అనే కాలమ్ మాత్రమే పెట్టి బీజేపీ ప్రజలను మోసం చేస్తోంది.దేశ జనాభాలో 52 శాతం ఉన్న బీసీలకు సరైన లెక్కలే లేవని, బీసీలకు అందాల్సిన రిజర్వేషన్ అందడం లేదు. ఇక తాజా కులగణనలో బీసీ కాలమ్ లేకపోవడం యావత్ బీసీ ప్రపంచానికే ప్రమాదకరం.. ఇప్పటికే బీసీలకు తీవ్ర అన్యాయం జరిగింది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వారిని వాడుకుంటున్నారు.. 75 ఏళ్లుగా బీసీల కులగణన లేకపోవడం దురదృష్టకరం, 33 అంశాల్లో ప్రత్యేకంగా ‘బీసీ కాలమ్’ ఉండాలి. అన్ని వర్గాలకు న్యాయం జరగాలని అన్నారు. అందుకోసం కులగణనలో ఎస్సీ, ఎస్టీలలో పాటు బీసీలకు కాలమ్ ఉండాలి!


జనగణన 2021లో చేయాల్సి ఉండగా కొవిడ్ కారణంగా చేయలేదు. కులగణనపై అన్ని రాష్ట్రాల్లో డిమాండ్ రావటంతో కేంద్రం అందుకు అంగీకరించిందని స్పష్టంగా తెలుస్తోంది. ఎస్సీ, ఎస్టీల కాలం పెట్టి, ఓబీసీ అని లేకుండా కులం అనే కాలం మాత్రమే డాక్యుమెంట్‌లో పెట్టారు. బీసీల విషయంలో ఎంత గందరగోళం ఉంటుందో ఆలోచించాలి.. కుల గణన విషయంలో బీజేపీ మాట తప్పినట్టు స్పష్టంగా తెలుస్తోంది. కులగణలో కులం కేటగిరీతో పాటు సబ్ కేటగిరీ ఉండాలి. జనగణనలో బీసీలను మోసం చేసే కుట్ర జరుగుతోంది. కులాల పేర్లతో పంచాయితీ పెట్టి ప్రజలను విడదీయడమే వీరి ప్లాన్ అని అనిపిస్తోంది. 1953లో, 1979లో, 2017లో ఏర్పడిన బీసీ కమిషన్ల సిఫార్సులు అరకొరగానే అమలయ్యాయి. ఒక కమిషన్ గడువును 13 సార్లు పొడిగించినా ఇంతవరకు నివేదికను ప్రభుత్వానికి సమర్పించలేదు. 2011లో జరిగిన సామాజిక ఆర్థిక కుల గణన వివరాలు ఉన్నాయని చెప్పిన కేంద్రం ఆ వివరాలు ఎందుకో బయట పెట్టకుండా దాటవేసింది. దేశంలో సగానికి పైగా జనాభా ఉన్న బీసీల విషయంలో కేంద్రం లెక్కలేనితనం చూపడం దారుణమైనది. దేశంలో బీసీలు ఎంతమంది ఉన్నారు వీళ్ల ఆర్థిక స్థితి గతులేమిటి వీరి చదువులు ఎలా ఉన్నాయి వీరి ఉద్యోగ అవకాశాలేమిటి లాంటి విషయాలలో ఇప్పటి వరకూ ఓ క్లారిటీ లేదు.. పశువుల, వన్య ప్రాణుల లెక్కలను క్రమం తప్పకుండా తీసే ప్రభుత్వానికి, బీసీ లెక్కలు తీయాలన్న విజ్ఞతను కనబరచపోవడం అమానవీయం. బీసీలను పశువులకన్నా తక్కువ చేసి చూడడం దుర్మార్గం. దేశంలో మెజారిటీ ప్రజలైన బీసీల అభివృద్ధిని, సంక్షేమాన్ని గాలికి వదిలేసి మాది ప్రజారంజక ప్రభుత్వం అని చెప్పుకోవడం సిగ్గుచేటు. హక్కుల సాధనకు ఉద్యమించిన రైతులను జైళ్లపాలు చేశారు.. ఉద్యమకారులపై పి.డి., ఉగ్రవాద చట్టాలను అమలు చేశారు. ఇలాంటి చర్యలు గతంలో ఎప్పుడూ ఈ దేశంలోని ప్రజలు ఎదుర్కొలేదు. ఇప్పటికైనా బీసీల ప్రధాన డిమాండ్‌ను పూర్తి చేయడం కేంద్రానికి కూడా చాలా మంచిది. దేశంలో బీసీల జనాభా 70 కోట్లు, మొత్తం జనాభాలో ఇది 56% అని అంచనా. 90 ఏళ్ల నాటి డేటా ఆధారంగానే కొనసాగుతున్న రిజర్వేషన్లు.. కులాల లెక్కలతోనే బీసీల అసలు జనాభా తెలుస్తుంది. కుల గణన చేపట్టాలంటూ డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. పది సంవత్సరాలకు ఓ సారి దేశంలో జనాభాను లెక్కిస్తున్నా.. అందులో దళితులు, ఆదివాసీల సంఖ్య పైన మాత్రమే స్పష్టమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. అయితే జనాభాలో ఓబీసీతో పాటు ఏఏ కులాల వారు ఎంతమంది ఉన్నారన్న సమగ్ర సమాచారం సేకరించడం లేదు. దేశంలో బడుగు, బలహీన వర్గాలకు బీజేపీ పార్టీ దశాబ్దాలుగా తీవ్ర అన్యాయం చేస్తూనే ఉంది. సామాజిక న్యాయం పేరుతో మాటలు చెప్పే బీజేపీ, అధికారంలో ఉన్న చోట బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించ డంలో పూర్తిగా విఫలమైంది. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలంటే రిజర్వేషన్ల పెంపు తప్పనిసరి. ఈ విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన నిర్ణయం తీసుకుని అమలు చేయాలి.

# 30 నిమిషాలు ఇలా నడిస్తే శరీరంలో జరిగే మార్పులు ఊహించలేరు



మనమందరం ఏదో ఒక సమయంలో అనుకుంటాం..నేను రేపు ఖచ్చితంగా జిమ్‌కి వెళ్తాను, లేదంటే వ్యాయామం చేస్తాను అని. కానీ ఉదయం నిద్రలేమి, చలి వాతావరణం, అత్యవసర పనులు లేదంటే, మరితనం కారణంగా ఆ వాయిదా వేయబడుతుంది. అటువంటి పరిస్థితిలో ఒక సులభమైన మార్గం ఉంది..జిమ్‌ను వదిలేసి నడవడం ప్రారంభించండి. కానీ గుర్తుంచుకోండి, ఇది కేవలం తీరికగా నడవడం కాదు. మీరు నిజంగా దాని ప్రయోజనాలను కోరుకుంటే, మీరు ప్రతిరోజూ గంటకు సుమారు 5 కిలోమీటర్ల వేగంతో 30 నిమిషాలు నడవాలి. ఇది కేవలం నడవడం మాత్రమే కాదు, సరిగ్గా నడవడం కూడా ముఖ్యం. చాలా మంది నేను రోజంతా నడుస్తాను అని అంటారు. కానీ ఇంటి పనులు చేయడం, దుకాణానికి వెళ్లడం లేదా ఆఫీసు చుట్టూ తిరగడం వ్యాయామం కాదు. ఫిట్‌నెస్ నడక భిన్నంగా ఉంటుంది. ఇందులో కొంచెం వేగవంతమైన వాకింగ్, లోతైన శ్వాస, శరీరం వెడెక్కాల్సి ఉంటుంది. గంటకు 5 కి.మీ వేగంతో నడవడం వల్ల హృదయ స్పందన రేటు సరైన స్థాయికి పెరుగుతుంది. ఇది మధ్యస్థ స్థాయి. ఇక్కడ శరీరం కొవ్వును కాల్చడం, శక్తిని పెంచడం ప్రారంభిస్తుంది. ఇది కేవలం నడవడం మాత్రమే కాదు, సరిగ్గా నడవడం కూడా ముఖ్యం. చాలా మంది నేను రోజంతా నడుస్తాను అని అంటారు. కానీ ఇంటి పనులు చేయడం, దుకాణానికి వెళ్లడం లేదా ఆఫీసు చుట్టూ తిరగడం వ్యాయామం కాదు. ఫిట్‌నెస్ నడక భిన్నంగా ఉంటుంది. ఇందులో కొంచెం వేగవంతమైన వాకింగ్, లోతైన శ్వాస, శరీరం వెడెక్కాల్సి ఉంటుంది. గంటకు 5 కి.మీ వేగంతో నడవడం వల్ల హృదయ స్పందన రేటు సరైన స్థాయికి పెరుగుతుంది. ఇది మధ్యస్థ స్థాయి. ఇక్కడ శరీరం కొవ్వును కాల్చడం, శక్తిని పెంచడం ప్రారంభిస్తుంది. అడపాదడపా నడవడం వల్ల ప్రయోజనాలను తగ్గిస్తుంది. మీరు 30 నిమిషాలు బయట ఉండి, మధ్యలో మీ ఫోన్ చూసుకున్నారనుకుందాం, ఎవరితోనైనా మాట్లాడటానికి ఆగినారనుకుందాం లేదా ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఎక్కువసేపు వేచి ఉన్నారనుకుందాం, అప్పుడు శరీరం చేసిన కృషి మళ్లీ మళ్లీ రీసెట్ అవుతుంది. ఫిట్‌నెస్ కోసం స్థిరమైన కదలిక చాలా అవసరం. మీరు ఆగకుండా కదిలినప్పుడు, మీ గుండె, ఊపిరితిత్తులు, కండరాలు ఒక లయలో పనిచేస్తాయి. ఈ స్థిరత్వం నిజమైన ప్రయోజనాలను అందిస్తుంది. మీ వేగం సరైనదని ఎలా అర్థం చేసుకోవాలి?: దీని గురించి పెద్దగా సాంకేతికంగా ఆలోచించాల్సిన అవసరం లేదు. ఒక సాధారణ నియమాన్ని గుర్తుంచుకోండి. మీరు 30 నిమిషాల్లో 2.5 కిలోమీటర్లు నడిస్తే, మీ వేగం సరైనది. ఈ వేగంతో, మీ శరీరం ఐదు నిమిషాల తర్వాత చురుగ్గా అనిపించడం ప్రారంభిస్తుంది. సరైన స్థలం, సరైన సమయాన్ని ఎంచుకోవడం ముఖ్యం. మీరు ప్రతి రెండు నిమిషాలకు ఆపవలసి వస్తే, మీరు వేగాన్ని కోల్పోతారు. కాబట్టి, నడవడానికి ప్రయత్నించండి. ఏదైనా పార్క్, లేదంటే, కాలనీలోని ప్రశాంతమైన వీధి లేదా పొడవైన కాలిబాటను ఎంచుకోండి. ట్రాఫిక్ తక్కువగా ఉన్న సమయాన్ని ఎంచుకోండి. ప్రతిరోజూ ఒకే సమయంలో నడవండి, ఉదాహరణకు ఉదయం లేదా సాయంత్రం. అది మీ దినచర్యలో భాగమైనప్పుడు, సాకులు తగ్గుతాయి. నడుస్తున్నప్పుడు మీ మొబైల్‌ను దూరంగా ఉంచండి. ప్రతి ఫోన్ నోటిఫికేషన్ కోసం వేచి ఉండటం వల్ల మీ వ్యాయామం పాడవుతుంది. అందువల్ల ఫోన్ ని సైలెంట్‌లో పెట్టండి. సమయం చూడటానికి మీ వాచ్ లేదా ఫిట్‌నెస్ బ్యాండ్‌ని చూడండి. మీ నడక తర్వాత కాల్స్ లేదా సందేశాలకు సమాధానం ఇవ్వండి. ఈ 30 నిమిషాలు మీ శరీరానికి, మనసుకు మాత్రమే ఉపయోగపడాలి. జిమ్ కంటే వాకింగ్ ఎందుకు మంచి ప్రత్యామ్నాయం అవుతుంది..? చురుకైన నడక గుండెను బలపరుస్తుంది. బరువును నిర్వహించడంలో సహాయపడుతుంది. మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. క్రమం తప్పకుండా వేగంగా నడటం వల్ల కేలరీలు బర్న్ అవుతాయి. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఒత్తిడి తగ్గుతుంది. అత్యుత్తమమైన విషయం ఏమిటంటే ఇది సులభం, ఉచితం, ఎక్కడైనా చేయవచ్చు.


# రోజూ గ్లాస్ ఆరెంజ్ జ్యూస్ తాగితే శరీరంలో జరిగే మార్పులు



ఆరెంజ్ జ్యూస్ తాగడం వల్ల మన ఆరోగ్యానికి అనేక రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ఇది తక్షణ శక్తిని అందించడంలో సూపర్‌గా పనిచేస్తుంది. అందుకే చాలా మంది ఈ జ్యూస్‌ను తాగేందుకు ఇష్టపడుతారు. నారింజ రసాన్ని తాగేందుకు చాలా మంది ఇష్టపడుతారు. ఎందుకంటే ఇది ఉప్పుగా, తీపిగా రుచికి చాలా అద్భుతంగా ఉంటుంది. అలాగే తక్షణ శక్తిని కూడా అందిస్తుంది. అయితే కొన్నాళ్లుగా చాలా మంది వెల్నెస్ ఔత్సాహికులు ఈ జ్యూస్‌ను పక్కపెట్టారు. ఎందుకంటే జ్యూస్‌లు అనేవి రిఫ్రెషింగ్‌గా ఉన్నప్పటికీ, మొత్తం పండ్లు అందించే ప్రయోజనాలను మాత్రం ఇవ్వలేవు. జ్యూస్ చేసే క్రమంలో మనం పండ్ల తొక్క, గుజ్జును తొలగించడం వల్ల వాటిలో ఉండే ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లను కోల్పోతాము. అలా ఫైబర్ లేని జ్యూస్ తాగినప్పుడు రక్తంలో షుగర్ లెవెల్స్‌లో హెచ్చుతగ్గులు ఏర్పడవచ్చు. అలాగే ఇది ఆకలి పెరగడానికి కారణం కావచ్చు. నిజానికి, వాణిజ్యపరంగా లభించే అనేక పండ్ల రసాలలో రుచిని పెంచేందుకు అదనపు చక్కెరలు యాడ్ చేస్తారు. వీటి కారణంగా ఊబకాయం, టైప్ 2 డయాబెటిస్‌తో సహా వివిధ ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే ఒక గ్లాసు నారింజ రసం తయారు చేయడానికి దాదాపు 2-5 నారింజ పండ్లు అవసరం పడుతుంది. దీని నుంచి ఎక్కువ కేలరీల కలిగిన జ్యూస్‌ను తీయవచ్చు. కానీ ఈ జ్యూస్‌లో మొత్తం పండులో ఉండే ఫైబర్, పోషకాలు మాత్రం ఉండవు. అయినప్పటికీ క్రమం తప్పకుండా నారింజ జ్యూస్ తాగడం వల్ల రక్తపోటును తగ్గించడం, శరీరంలో మంటను తగ్గించడం, గుండె ఆరోగ్యాన్ని పెంచడం గుండె జబ్బులు, మధుమేహం, అనేక దీర్ఘకాలిక అనారోగ్యాలు చాలా వరకు ఆక్సీకరణ ఒత్తిడి కారణంగా వస్తాయి. అయితే 100 శాతం ఆరెంజ్ జ్యూస్‌లో ఉండే యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ సమ్మేళనాలు ఇంటర్‌లుకిన్-6 వంటి తక్కువ స్థాయి శోథ మార్కర్లతో సంబంధం కలిగి ఉండి.. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. అధిక కొలెస్ట్రాల్ లేదా ట్రైగ్లిజరైడ్స్ ఉన్న వ్యక్తులపై చేసిన ఒక ప్రయోగంలో 90 రోజుల పాటు ఆరెంజ్ జ్యూస్ తీసుకోవడం వల్ల యాంటీఆక్సిడెంట్ సామర్థ్యం పెరిగి, లిపిడ్ పెరాక్సిడేషన్ తగ్గింది. ఈ యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ ప్రభావాలు రక్త నాళాలను రక్షించడంలో సహాయపడతాయి. అలాగే హృదయ, జీవక్రియ వ్యాధుల దీర్ఘకాలిక ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

# సంతాన సామర్థ్యాన్ని పెంచే పండ్లు

ఉరుకులు పరుగులు ఆధునిక జీవితంలో చాలా మంది ఫెర్టిలిటీ సమస్య (సంతానలేమి)తో బాధపడుతున్నారు. చాలామంది పెళ్లైన కొన్నేకు కూడా పిల్లలు కలగకపోవడం.. లేదా ఇతర అనారోగ్య సమస్యలు.. లాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.. అయితే.. కొన్ని సహజ సిద్ధమైన పండ్లతో కూడా స్టామినాను పెంచుకోవచ్చని.. వంధత్వాన్ని దూరం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఉరుకులు పరుగులు ఆధునిక జీవితంలో చాలా మంది ఫెర్టిలిటీ సమస్య (సంతానలేమి)తో బాధపడుతున్నారు. చాలామంది పెళ్లైన కొన్నేకు కూడా పిల్లలు కలగకపోవడం.. లేదా ఇతర అనారోగ్య సమస్యలు.. లాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.. ఫెర్టిలిటీ అంటే పిల్లలను కనే సహజ సామర్థ్యం.. సంతానలేమి (ఇన్ ఫెర్టిలిటీ) అంటే.. పెళ్లైన ఒక సంవత్సరం లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు గర్భనిరోధక సాధనాలు వాడకుండా క్రమబద్ధమైన శారీరక కలయిక ఉన్నపటికీ గర్భం దాల్చకపోవడం.. ఇది స్త్రీ లేదా పురుషులలో.. లేదా ఇద్దరిలో ఏదో ఒక లోపం ఉండవచ్చు.. వయస్సు, వంధత్వం, జీవనశైలి, ఆహారం, వైద్య పరిస్థితులు సంతానోత్పత్తిని ప్రభావితం చేస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.. వంధత్వంతోపాటు.. పురుషులలో వీర్యకణాల లోపం, స్త్రీలలో అండాల ఉత్పత్తి లోపం వంటివి ప్రధాన కారణాలని చెబుతున్నారు. అయితే.. కొన్ని సహజ సిద్ధమైన పండ్లతో



కూడా స్టామినాను పెంచుకోవచ్చని.. వంధత్వాన్ని దూరం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ పండ్లతో ఫెర్టిలిటీ సామర్థ్యం పెరుగుతుందని పేర్కొంటున్నారు. అవకాడో: ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్ ఇ, ఫోలేట్‌తో నిండి ఉంటుంది.. ఇది అండాల నాణ్యతను, స్పెర్మ్ నాణ్యతను మెరుగు చేస్తుంది.బ్లూ బెర్రీస్: వీటిలోని ఆంథోసైనిన్ వంటి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు.. ఫ్రీ రాడికల్స్ నుంచి గర్భాశయం, శుక్రకణాలను రక్షిస్తాయి.దానిమ్మ: విటమిన్ సీ, ఫోలేట్ వంటి పోషకాలతో టెస్టోస్టెరాన్ స్థాయిలను పెంచి, స్పెర్మ్ నాణ్యతను మెరుగుపరుస్తుంది.నారింజ: విటమిన్ సీతో నిండి, శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను తగ్గిస్తుంది.. ఇంకా శక్తిని పెంచుతుంది.అరటిపండు: విటమిన్ ః6 వల్ల హార్మోన్ల సమతుల్యాన్ని ఉంచి సంతాన ఆరోగ్యానికి సహాయపడుతుంది.కివీ: కివీలోని విటమిన్ సీ, ఈ.. శరీరంలో ఫెర్టిలిటీకి అవసరమైన పోషకాలను అందిస్తాయి..జామపండు: పోషకాలతో నిండి ఉన్న జామ.. అండాలు, స్పెర్మ్ నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. స్ట్రాబెర్రీస్: యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండి శరీరంలోని ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి ఫెర్టిలిటీని మెరుగుపరుస్తాయి.టమాటా: లైకోపీన్‌తో నిండి ఉంది.. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పని చేసి స్పెర్మ్ నాణ్యతకు మేలు చేస్తుంది. ఈ పండ్లు సంతాన సామర్థ్యాన్ని పెంచుతాయి.. అయితే.. ముఖ్యంగా ఆరోగ్యకరమైన ఆహారం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండటం, సరైన సమయంలో వైద్యులను సంప్రదించడం ద్వారా సంతానోత్పత్తిని కాపాడుకోవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఏమైనా సమస్యలుంటే.. ఆరోగ్య నిపుణులను సంప్రదించి వారు చెప్పిన విధంగా చికిత్స పొందడం ఉత్తమం..


# అతడు టీమిండియాకు కీలకం అవుతాడు రికీ పాంటింగ్




టీ 20 ప్రపంచ కప్ 2026 సమీపిస్తోంది. టీమిండియా హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగనుంది. అయితే ప్రస్తుతం అందరి దృష్టి విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ పైనే ఉంది. ఇప్పటికే అతడు టీ 20 ఫార్మాట్లో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ అభిషేక్ శర్మ బ్యాటింగ్ పై స్పందించాడు. గతంలో తాను అన్నట్లే అభిషేక్ సూపర్ స్టార్ అయ్యాడని గుర్తు అన్నారు. ఐపీఎల్ లో అభిషేక్ కు నేను తొలి కోచ్. అతను నాతో అరంగేట్రం చేశాడు. అప్పుడు 17 ఏళ్ల కుర్రాడిగా అభిషేక్ దిల్లీ తరఫున రాణించాడు. ఐపీఎల్‌లో తొలి ఇన్నింగ్స్‌లో మొదటి బంతికే బౌలర్ తల మీదుగా ఫోర్ లేదా సిక్స్ బాదినట్లు గుర్తు. అతనిలో ఏదో ప్రత్యేకత ఉందని అప్పుడే అనుకున్నా. అభిషేక్ ను ట్రేడ్ చేయొద్దని దిల్లీ మేనేజ్‌మెంట్‌ను పదే పదే కోరా. భవిష్యత్తులో ఈ కుర్రాడు సూపర్ స్టార్ అవుతాడని అనుకున్నా, ఇప్పుడే అదే జరిగింది. రానున్న టీ 20 ప్రపంచ కప్ లో అభిషేక్ రాణిస్తాడని నమ్మకం ఉంది. అతడు టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచి ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు దక్కించుకునే అవకాశం కూడా ఉంది. అతడికి ఆ సత్తా ఉంది. అభిషేక్ చెలరేగితే భారత్ ను ఓడించడం మరింత కష్టతరం అవుతుంది. కాబట్టి ఈ ప్రపంచ కప్ లో అభిషేక్ టీమిండియాకు చాలా కీలకమవుతాడు అని రికీ పాంటింగ్ అన్నాడు. దిల్లీ తరఫున ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన అభిషేక్ శర్మ తన తొలి మ్యాచు లోనే చెలరేగిపోయాడు. 19 బంతుల్లోనే 46 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. 2019 సీజన్ నుంచి సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆడుతున్నాడు.

# ప్లేయర్లను ఆడొద్దని బోర్డు చెప్పడం సమంజసం కాదు కపిల్ దేవ్

టీ 20 ప్రపంచ కప్ 2026 లో భారత్ తో మ్యాచ్ ను పాకిస్థాన్ బహిష్కరించిన విషయం తెలిసిందే. ఈ అంశం ప్రస్తుతం తీవ్ర చర్చకు దారి తీసింది. టోర్నీలో పాల్గొంటాం కానీ భారత్ తో మాత్రం ఇప్పుడే కాదు ఇంకెప్పుడు మ్యాచులు ఆడబోమని పీసీబీ ప్రకటించింది. దీని పై ఐసీసీ తీవ్రంగా స్పందించి పాకిస్థాన్ బోర్డును హెచ్చరించినా ఆ దేశం మొండి వైఖరినే ప్రదర్శిస్తోంది. గ్రూప్ స్టేజిలో భారత్-పాక్ మ్యాచ్ కొలంబో వేదికగా ఫిబ్రవరి 15 న జరగాల్సి ఉంది. అయితే పాకిస్థాన్ నిర్ణయాన్ని టీమిండియా మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ తప్పు బట్టారు. ఒకవేళ ఈ నిర్ణయం ఆటగాళ్లు తీసుకుంటే వాళ్లు ముందకు వచ్చి చెప్పొచ్చు. కానీ ఆటగాళ్లు ఆడకూడదని బోర్డు నిర్ణయం తీసుకుంటే దేశ ప్రతిష్ఠ దెబ్బతింటుంది. ఈ నిర్ణయం పాక్ ప్రగతికి ఏ మాత్రం దోహదపడదు. వారు పాక్ క్రికెట్ ను చంపేస్తున్నారు. ప్రపంచ కప్ ఆడకుండా క్రికెటర్లను అడ్డుకోవడం సమంజసం కాదు. వారి సొంత ఆటగాళ్లకే వారు అన్యాయం చేసినట్లవుతుంది అని కపిల్ దేవ్ పేర్కొన్నారు. ఒకవేళ గ్రూప్ స్టేజిలో పాక్.. భారత్ తో మ్యాచ్ ఆడకుంటే నెట్ రన్ రేట్ పరంగా వెనకబడుతుంది. మ్యాచ్ పాయింట్లు కూడా భారత్ కు వస్తాయి. దీంతో మెగా టోర్నీలో పాక్ ముందుకుసాగలేని పరిస్థితి ఏర్పడుతుంది.




ఆర్థికపరంగానూ పాక్ క్రికెట్ బోర్డు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. ఈ వైఖరినే కొనసాగిస్తే పాక్ ఐసీసీ నుంచి నిషేధాన్ని కూడా ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

# అండర్-19 వరల్డ్ కప్... ఫైనల్లోకి దూసుకెళ్లిన టీమిండియా... ఇంగ్లండ్ తో అమీతుమీకి సై

అండర్-19 ప్రపంచకప్‌లో భారత యువ జట్టు అదరగొట్టింది. రికార్డు స్థాయి ఛేజింగ్ తో ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన రెండో సెమీ ఫైనల్లో ఆఫ్ఘనిస్థాన్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్ ఆరోన్ జార్జ్ (115) అద్భుతమైన సెంచరీతో చెలరేగగా, విధ్వంసకర హాఫ్ సెంచరీలతో వైభవ్ సూర్యవంశీ, కెప్టెన్ ఆయుష్ మాత్రే జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఫిబ్రవరి 6న ఇదే వేదికపై జరగనున్న ఫైనల్లో భారత్, ఇంగ్లండ్‌తో తలపడనుంది.ఆఫ్ఘనిస్థాన్ నిర్దేశించిన 311 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ కేవలం 41.1 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఈ టోర్నీలో ఇప్పటివరకు పెద్దగా రాణించని ఆరోన్ జార్జ్, కీలకమైన సెమీస్‌లో బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. 104 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్సర్లతో 115 పరుగులు చేసి జట్టు విజయాన్ని ఖాయం చేశాడు. మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (33 బంతుల్లో 68) మెరుపు ఇన్నింగ్స్‌తో శుభారంభం అందించాడు. ఫీల్డర్లు రెండుసార్లు క్యాచ్‌లు జారవిడిచిన అవకాశాన్ని సూర్యవంశీ చక్కగా సద్వినియోగం చేసుకున్నాడు. అనంతరం కెప్టెన్ ఆయుష్ మాత్రే (39 బంతుల్లో 62) కూడా వేగంగా ఆడి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు.భారత ఛేదనలో భాగస్వామ్యాలు కీలక పాత్ర పోషించాయి. తొలి వికెట్‌కు జార్జ్, సూర్యవంశీ 90 పరుగులు జోడించగా, రెండో వికెట్‌కు
జార్జ్, కెప్టెన్ మ్హాత్రే కలిసి 114 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఇక మూడో వికెట్‌కు విహాన్ మల్హోత్రా (47 బంతుల్లో 38 నాటౌట్)తో కలిసి జార్జ్ మరో 96 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పి జట్టును విజయ తీరాలకు చేర్చాడు.అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్థాన్, నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 310 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఫైసల్ షినోజాడా (93 బంతుల్లో 110), ఉజైరుల్లా నియాజీ (86 బంతుల్లో 101 నాటౌట్) అద్భుత సెంచరీలతో కదం తొక్కారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 148 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. భారత బౌలర్లలో దీపేశ్ దేవేంద్రన్, కనిష్క్ చౌహాన్ చెరో రెండు వికెట్లు తీసినప్పటికీ, మిగతా బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు.ఈ విజయంతో భారత్ మొత్తమ్మీద పదోసారి అండర్-19 ప్రపంచకప్ ఫైనల్‌కు అర్హత సాధించగా, వరుసగా ఆరోసారి తుదిపోరుకు చేరడం విశేషం.

# #బార్డర్ 2.. 'దురంధర్'ని టచ్ చేయడం అసాధ్యం





దురంధర్ చిత్రానికి సంక్రాంతి సెలవులు బాగా కలిసొచ్చాయి... సౌత్ లో కూడా బాగా ఆడింది.. ఆ పరిస్థితి సన్నీడియోల్ బార్డర్2 చిత్రానికి లేదు. దురంధర్ ఒరిజినల్ కథతో.. బయోపిక్ కేటగిరీలో వచ్చిన సినిమా కాబట్టి అన్‌స్టాపబుల్ గా దూసుకెళ్లింది.. కానీ బార్డర్ 2 సీక్వెల్ సినిమా... ఇప్పటికే చూసేసిన ఎమోషన్స్ రొటీన్ వార్ డ్రామా కాబట్టి దీనికి అంత సీన్ లేదని విశ్లేషిస్తున్నారు.నిజానికి బార్డర్ 2 చిత్రానికి పండగ సెలవులు ఏవీ కలిసి రాలేదు. కేవలం వీకెండ్స్ పై మాత్రమే ఆధారపడి ఫుల్ రన్ ని సాగించాల్సి ఉంటుంది. అందువల్ల దురంధర్ రేంజులో వసూలు చేయడం సాధ్యపడదు. అలాగే బార్డర్ 2 కి రెండో వారంలో అసలైన టెస్ట్ మొదలవుతుంది. ఇంకా నాలుగైదు వారాలు భారీగా వసూలు చేయాల్సి ఉంటుంది. కానీ ఈ దేశభక్తి సినిమా దురంధర్ స్థాయికి వెళుతుందని ట్రేడ్ భావించడం లేదు. అయితే బార్డర్ 2 సన్నీడియోల్ కెరీర్ బెస్ట్ హిట్ చిత్రాలలో ఒకటిగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. ఈ చిత్రంలో నటించిన వరుణ్ ధావన్, అహాన్ శెట్టి లాంటి యువహీ రోలకు ఒక మంచి హిట్టు దక్కినట్టయిం ది. ఇకపై యంగ్ హీరో లు సోలో హిట్లతో నిరూపించాల్సి ఉంటుంది.

బాలీవుడ్ మీడియా ఒక్కోసారి ఊదరగొట్టేస్తుంటుంది. ముఖ్యంగా ఉత్తరాది బాక్సాఫీస్ వద్ద సౌత్ సినిమా డామినేషన్ ని హిందీ మీడియా తట్టుకోలేకపోతోంది. పర్యవసానంగా బాలీవుడ్ రైజింగ్ ని చూడాలని కసిగా వేచి చూస్తోంది. కరోనా క్రైసిస్ తర్వాత ఉత్తరాదిన దక్షిణాది సినిమా హవా కొనసాగడం... హిందీ పరిశ్రమ డిజాస్టర్లతో నీరసపడిపోవడంతో ఇంతకాలం వేచి చూసింది. షారూఖ్ పఠాన్-జవాన్ కొంతవరకూ ఊరట. స్త్రీ 2, చావా లాంటి సినిమాలు ఆదుకున్నాయి. ఇప్పుడు రణ్ వీర్ సింగ్ -దురంధర్- హిందీ పరిశ్రమ గౌరవాన్ని కాపాడింది. -దురంధర్- చిత్రం 50రోజుల్లో 800కోట్ల నెట్... వసూళ్లను సాధించడం నిజంగా ఒక రికార్డ్. అయితే దురంధర్ వసూళ్ల విషయంలో కొన్ని హిందీ మీడియాలు చాలా హైప్ క్రియేట్ చేయడానికి ప్రయత్నించాయన్నది వాస్తవం. ఒరిజినల్ లెక్కలకు మీడియా చూపించిన లెక్కలకు కచ్చితంగా తేడా ఉంది. అయినా దురంధర్ క్లీన్ బ్లాక్ బస్టర్ గా రికార్డులకెక్కిందనడంలో సందేహం లేదు.అయితే ఇప్పుడు సన్నీడియోల్ లాంటి సీనియర్ హీరో నటించిన బార్డర్ 2 చిత్రం విషయంలోను బాలీవుడ్ మీడియా అత్యుత్సాహం చూస్తుంటే ఇది చాలా కామెడీగా అనిపిస్తోంది. బార్డర్ 2 చిత్రం 6 రోజుల్లో 213 కోట్ల నెట్ వసూలు చేసింది. అయితే బార్డర్ 2 దురంధర్ రికార్డులను కొట్టేస్తుంది! అంటూ ఒక సెక్షన్ మీడియా ప్రచారం చేస్తోంది. నిజానికి బార్డర్ 2 కి అంత సీన్ లేదని కొందరు క్రిటిక్స్ విశ్లేషించారు.బార్డర్ 2 చిత్రం 50 రోజులు ఆడినా 800కోట్లు తేవడం కష్టం.. ఇప్పటికి బాగా ఆడుతున్నా కానీ, దురంధర్ రన్ వేరే..



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com